నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 24-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 127 | పేజీలు: 4 | వెల: రూ.1/-

జర్నలిస్టు ఖషోగ్గి హత్య.. అయిదుగురికి మరణశిక్ష

హైదరాబాద్, డిసెంబర్23: సంచలనం రేపిన జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి హత్య కేసులో ఇవాళ సౌదీ అరేబియా కోర్టు అయిదుగురికి మరణశిక్షను విధించింది. సౌదీ ప్రభుత్వాన్ని విమర్శించే జర్నలిస్టుగా ఖషోగ్గి ఫేమస్. అయితే టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో ఉన్న సౌదీ కాన్సులేట్‌లో జర్నలిస్టు ఖషోగ్గిని హత్య చేశారు. ఆ హత్యలో సౌదీ పాత్ర ఉన్నట్లు అమెరికా తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

అదో తప్పుడు ఆపరేషన్ అని సౌదీ అరేబియా ప్రాసిక్యూటర్ ఇవాళ తెలిపారు. ఈ కేసులో మొత్తం 11 మందిని అరెస్టు చేసి విచారించారు. వారి వివరాలను మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. ఖషోగ్గి హత్యపై ఐక్యరాజ్యసమితి నిపుణులు కూడా గతంలో స్పందించారు. ఆ హత్య కోర్టు బయట జరిగిన నేరంగా పరిగణించింది. 2018, అక్టోబర్ 2న ఖషోగ్గి హత్య జరిగింది. ఈ కేసులో మాజీ డిప్యూటీ ఇంటెలిజెన్స్ చీఫ్ అహ్మద్ అల్ అసిరిని నిర్దోషిగా రిలీజ్ చేశారు.

'దిశ' నిందితుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

– పోస్టుమార్టం నిర్వహించిన ఎయిమ్స్ ఫోరెన్సిక్ నిపుణుల బృందం
– ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్
– రిపోర్టును సీల్డ్ కవర్‌లో కోర్టుకందించనున్న అధికారులు

హైదరాబాద్, డిసెంబర్23(ఆర్ఎన్ఎ) : దిశ హత్యాచార కేసు నిందితుల మృతదేహాలకు గాంధీ ఆస్పత్రిలో రీపోస్టుమార్టం ప్రక్రియ కొనసాగింది. నాలుగు మృతదేహాలకు ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు రీపోస్టుమార్టం చేశారు. ఎయిమ్స్ ఫోరెన్సిక్ శాఖ అధిపతి సుధీర్ గుప్తాతో పాటు అభిషేక్ యాదవ్, ఆదర్శ్ కుమార్ వైద్య బృందం రీపోస్టుమార్టం ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియను వీడియో తీసి.. తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ కు అప్పగించనున్నారు. తొలుత సోమవారం ఉదయం గాంధీ ఆస్పత్రికి చేరుకున్న వైద్యుల బృందం మృతుల చుట్టాలతో వైద్య బృందం ముందుగా మాట్లాడారు. మృతదేహాలను కుటుంబ సభ్యులు గుర్తించిన తరువాతనే పోస్ట్ మార్టమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులతో వైద్య బృందం సభ్యులు మాట్లాడారు. ఏమైనా అనుమానాలు ఉన్నాయా..? అంటూ వారిని ప్రశ్నించారు. దీంతో కుటుంబ సభ్యులు మాత్రం.. తమకు ఎలాంటి అనుమానాలు లేవని, కానీ తమ వారి మృతదేహాలను మాకు అప్పగిస్తే మేము ఖననం చేసుకుంటామని తెలిపారు. అనంతరం మృతదేహాలకు రీ పోస్టుమార్టం నిర్వహించేందుకు పోస్టుమార్టం రూంకు వెళ్లారు. ఇదిలా ఉంటే పోస్టుమార్టం ప్రక్రియను మొత్తం వీడియో రికార్డు చేశారు. వారి నివేదికను సీడీ, పెన్ డ్రైవ్ ద్వారా హైకోర్టుకు రిపోర్టు అందజేయనున్నారు. రీ పోసుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా సోమవారం ఉదయం గాంధీ హాస్పిటల్ సూపరిటెండెంట్ డా. శ్రవన్ మాట్లాడారు.. ఎయిమ్స్ నుంచి నలుగురు వైద్యుల బృందం రీ పోస్ట్ మార్టమ్ చేయడానికి వచ్చారని ఆయన చెప్పారు. పోస్ట్ మార్టమ్ ను వీడియో రికార్డింగ్ చేస్తున్నట్లు చెప్పారు. రిపోర్ట్స్ అన్ని రహస్యంగా జరుగుతున్నాయని.. సీడీ, పెన్ డ్రైవ్ ద్వారా హైకోర్టుకు రిపోర్ట్ అందజే స్తామని ఆయన చెప్పారు. మెడికల్ బృందానికి చైర్మన్ లీడింగ్ చేస్తున్నారని తెలిపారు. సాయంత్రం 5గంటల లోపు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందిస్తామని చెప్పారు. రెండు అంబులెన్స్ లలో వారి వారి గ్రామాలకు పంపిస్తామని తెలిపారు. రీ పోస్ట్ మార్టం లో గాంధీ డాక్టర్లు ఎవ్వరూ పాల్గొనడం లేదనిడా. శ్రవణ్ చెప్పారు. గతంలో ఫోరెన్సిక్ వైద్యులు చేసింది ఏంటో తమకు తెలియదని అన్నారు. రిపోర్ట్ రెండు రోజుల్లో ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. 4రోజులు రీఫ్రిజిరేటర్ లో పెట్టడంవల్ల.. 50శాతానికి పైగా మృతదేహాలు డి కంపోజ్ అయ్యాయని చెప్పారు. ప్రత్యేక వైద్యుల బృందం అడిగిన యంత్ర పరికరాలను సమకూర్చామని తెలిపారు. వింటర్ సీజన్ వల్ల డెడ్ బాడీలు ఇంకా మొత్తం పాడవలేదని.. సమ్మర్‌లో అయితే మూడు రోజుల్లో బాడీస్ డీ కంపోజ్ అయ ఎపోతాయని ఆయన చెప్పారు. ఇదిలాఉంటే నిందితుల శరీరాల్లో ఉన్న బులెట్లపై ఒక క్లారిటీ వచ్చింది. ఎవరెవరి శరీరంలో ఎన్నె న్ని బులెట్లు ఉన్నాయో వైద్యులు గుర్తి ంచారు. ఏ1 మహమ్మద్ ఆరిఫ్ శరీరంలో 4 బులెట్ గాయాలను గుర్తించగా.. ఏ2 నిందితుడు చెన్నకేశవులు శరీరంలో 3 బులె ట్లు.. ఏ3 నవీన్ శరీరంలో 2 బు÷-లలెట్లు.. ఏ4 శివ శరీరంలో ఒక బులెట్‌ను వైద్యులు గుర్తించినట్లు తెలిసింది.

పోలీసులకు పట్టుబడ్డ ఏటీఎం దొంగలు

హైదరాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): ఫలక్ నుమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏటీఎంలో చోరీ యత్నం జరిగింది. సిండికేట్ బ్యాంకు ఏటీఎం నుంచి ముగ్గురు నగదును దొంగలించేందుకు యత్నించారు. చోరీకి పాల్పడతున్న సమయంలో అటుగా వచ్చిన పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది దుండగులను రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. చోరికి యత్నించిన నిందితులు మొబిన్, సాజిద్, షేక్ ఖాసీంలుగా గుర్తించారు. నిందితుల్లో ఒకరైన మొబిన్ గతంలో నిజాం మ్యూజియంలో చోరీ కేసులో నిందితుడు.

కన్నకొడుకునే హతమార్చిన తల్లి

– అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని హత్య
– రాజేంద్రనగర్‌లో అమానుష ఘటన

హైదరాబాద్, డిసెంబర్23(ఆర్ఎన్ఎ) : అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని పేగుతెంచుకుని పుట్టిన బిడ్డనే గొంతు నులిమి చంపేసిందో కసాయి తల్లి. హైదరాబాద్ శివారు ప్రాంతమైన రాజేంద్రనగర్‌లో సోమవారం ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. రాజేంద్రనగర్‌లో ఓ కుటుంబం నివాసం ఉంటుంది. వారికి ఏడేళ్ల కుమారుడు అంజాద్ సంతానం. అయితే ఆ మహిళ మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడనే కారణంతో బిడ్డను చంపాలని నిర్ణయించుకుంది. సోమవారం ఉదయం తన ఏడేళ్ల కుమారుడిని అత్యంత పాశవికంగా గొంతు నలిమి హత్య చేసింది. తర్వాత ఏమీ తెలియనట్లు నటించింది. ఈ విషయం స్థానికులకు తెలియడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న మైలార్ దేవిపల్లి పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని కన్న బిడ్డను తల్లే చంపడంపై కాలనీ వాసులు ఉలిక్కిపడ్డారు. ఆ కసాయి తల్లిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

మహారాష్ట్రలో స్వల్ప భూకంపం

ముంబయి,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో మళ్లీ భూమి కంపించింది. సతరా జిల్లాలో సోమవారం ఉదయం స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. కోయ్నా రీజియన్ లో ఉదయం 6:42 గంటలకు భూమి కంపించినట్లు మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 2.6గా నమోదైంది. ఈ భూప్రకంపనల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. కోయ్నా డ్యామ్కు 8 కిలోమీటర్ల దూరంలో భూకంపం కేంద్రీకృతమైందని అధికారులు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని పల్ఘర్ జిల్లాలోనూ ఈ నెల 14వ తేదీన భూప్రకంపనలు సంభవించాయి. దహను తాలుకాలోని దుండల్‌వాడి గ్రామంలో 13 వ తేదీ మధ్యాహ్నం నుంచి 14 వ తేదీ తెల్లవారుజాము వరకు మూడు సార్లు భూమి కంపించింది. ఆ గ్రామంలో భూమి కంపించిన మాట వాస్తవమేనని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ కైలాష్ షిండే స్పష్టం చేశారు. 14వ తేదీ తెల్లవారుజామున 5:22 గంటలకు భూమి కంపించగా, రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 3.9గా నమోదైంది. 13వ తేదీ మధ్యాహ్నం 12:26 గంటలకు తొలిసారిగా భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.2గా నమోదు కాగా, ఆ రోజు రాత్రి 9:55 గంటలకు రెండోసారి భూమి కంపించింది. ఈ సమయంలో భూకంప తీవ్రత 3.4గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూమి స్వల్పంగా కంపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

ఐదుగురు మహిళలను అరెస్టుచేసిన రైల్వే పోలీసులు

హైదరాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): రద్దీగా ఉన్న రైళ్ల, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల బ్యాగుల్లోని బంగారు ఆభరణాలు, నగదు దొంగిలిస్తున్న ఐదురుగు మహిళలను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. నిందితుల వద్ద నుంచి 13 గ్రాముల బంగారు గొలుసు, రూ.9వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. గుజరాత్ అహ్మదాబాద్ చెందిన మంజు సోలంకి(45), తారా గోపి సతాలియా అలియాస్ తారా(50), మంజు మనోజ్ కవతియా (47), జ్యోతి(25), కాజల్(22)లు బంధువులే. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఫుట్ ఉంటూ పాతబట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈజీగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు ఎంచుకున్నారు. దీనిలో భాగంగానే రద్దీగా ఉన్న రైళ్లు, రైల్వే స్టేషన్లను టా÷-గ్గ÷ట్ చేసుకొని ప్రయాణికులు రైలు ఎక్కుతున్న సమయంలో గుంపుగా ఏర్పడి బ్యాగ్ నగదు, నగలను దొంగిలిస్తున్నారు. పలువురు బాధితులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఉదయం రైల్వే స్టేషన్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకొని విచారించగా, చేసిన నేరాన్ని అంగీకరించారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

మహారాష్ట్రలో స్వల్ప భూప్రకంపనలు

– రిక్టర్ స్కేలుపై 2.6గా నమోదు
– వరుస ప్రకంపనలతో ఆందోళనలో మహారాష్ట్ర ప్రజలు

ముంబై,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని సతరా జిల్లాలో సోమవారం ఉదయం స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. కోయ్నా రీజియన్ లో ఉదయం 6:42 గంటలకు భూమి కంపించినట్లు మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు.

రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 2.6 గా నమోదైంది. ఈ భూప్రకంపనల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. కోయ్నా డ్యామ్ కు 8 కిలోమీటర్ల దూరంలో భూకంపం కేంద్రీకృతమైందని అధికారులు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని పల్ఘర్ జిల్లాలోనూ ఈ నెల 14వ తేదీన భూప్రకంపనలు సంభవించాయి. దహను తాలుకాలోని దుండల్‌వాడి గ్రామంలో 13 వ తేదీ మధ్యాహ్నం నుంచి 14 వ తేదీ తెల్లవారుజాము వరకు మూడు సార్లు భూమి కంపించింది. ఆ గ్రామంలో భూమి కంపించిన మాట వాస్తవమేనని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ కైలాష్ షిండే స్పష్టం చేశారు. 14 వ తేదీ తెల్లవారుజామున 5:22 గంటలకు భూమి కంపించగా, రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 3.9 గా నమోదైంది. 13 వ తేదీ మధ్యాహ్నం 12:26 గంటలకు తొలిసారిగా భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.2 గా నమోదు కాగా, ఆ రోజు రాత్రి 9:55 గంటలకు రెండోసారి భూమి కంపించింది. ఈ సమయంలో భూకంప తీవ్రత 3.4 గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూమి స్వల్పంగా కంపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. తాజాగా సోమవారం ఉదయం భూమి కంపించడంతో ఆ రాష్ట్ర ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కాగా మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు.

తెలంగాణలో బలమైనశక్తిగా ఆర్ఎస్ఎస్

– హైదరాబాద్‌లో 800 శాఖలున్నాయి
– 25న సరూర్‌నగర్ స్టేడియంలో 'సార్వజనిక సభ'
– బీవీఆర్ మోహన్‌రెడ్డి, మోహన్‌భగవత్‌లు పాల్గొంటారు
– ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రమేష్

హైదరాబాద్, డిసెంబర్23(ఆర్ఎన్ఎ) : తెలంగాణలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) బలమైన శక్తిగా ఉందని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ అన్నారు. బర్కత్పుర కేశవ నిలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడు దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ పలు కార్యక్రమాలు చేపడుతోందని ఆయన తెలిపారు. 2024 నాటికి వంద ఏళ్లు పూర్తి చేసుకోబోతోందని రమేష్ పేర్కొన్నారు. ఇప్పటివరకు 1600 క్లస్టర్లు ఉన్నాయని, అన్ని క్లస్టర్లకు ఆర్ఎస్ఎస్ చేరుకోవలనే లక్ష్యంతో విజయ సంకల్ప శిబిరం పేరుతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. డిసెంబర్ 24, 25, 26 తేదీల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అతిథిగా రాబోతున్నారని రమేష్ తెలిపారు. భారతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో 'సార్వజనిక సభ' నిర్వహిస్తున్నామని రమేష్ చెప్పారు. దీనికి ముఖ్య అతిథులుగా ఐఐటీ హైదరాబాద్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డితో పాటు, వక్తగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొంటారని రమేష్ తెలిపారు. 2024 లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ప్రతి బస్తీకి ఇప్పటికే చేరుకోగలిగామని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్‌కి హైదరాబాద్ నగరంలో 800 శాఖలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇప్పటికే 1005 సేవ కార్యక్రమాలు చేపటామని రమేష్ వెల్లడించారు. తెలంగాణలో విస్తరించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే

మేడారంలో పక్కాగా ప్లాస్టిక్ నిషేధం

ఉపాధి పొందుతున్న మహిళా సంఘాలు

ములుగు,డిసెంబర్23(నేటినిజం ప్రతినిధి): గతంలో ఎప్పుడూ లేనంత పక్కాగా ఈ యేడాది మేడారం జాతరలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నారు. జాతరకు రెండు నెలల ముందు నుంచే పెద్ద ఎత్తున కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రచారాన్ని చేపట్టారు. దీంతో వ్యాపారులు కూడా అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. అలాగే స్వయం సహాయక సంఘాలు కూడా జూట్ బ్యాగులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. మేడారం జాతరలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నందున 20 లక్షల జూట్, పేపర్ బ్యాగులను 200 మంది టైలర్లతో తయారు చేయించాలని డీఆర్డీవో వసంతరావు ఆదేశించారు. ఏటూరునాగారం బ్లాక్ రిసోర్సు సెంటర్ పరిధిలోని ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు చెందిన బీఆర్సీ కో ఆర్డినేటర్లతో ఇటీవల సమావేశం నిర్వహించి లక్ష్యాన్ని నిదర్శించారు. జాతరలో ప్లాస్టిక్ వాడకం అరికట్టేలా పనిచేయాలని సూచించారు. పేపర్, జూట్ బ్యాగుల విక్రయంతో మహిళలు పెద్ద మొత్తం ఆర్థికాదాయం పొందుతారని పేర్కొన్నారు. మేడారంలో చిరు వ్యాపారాలు చేసుకునే వారిని ప్రోత్సహించాలని, వారికి రుణాలు అందించాలన్నారు. రూ. 50వేల లోపు ఇస్తున్న రుణాలు ఏ మేరకు అమలు జరుగుతున్నాయో, అవి ఎలా సద్వినియోగం అవుతున్నాయో కో ఆర్డినేటర్లను అడిగి తెలుసుకున్నారు. మంచి యూనిట్లు నెలకొల్పుకునేలా, రుణాలు ఇవ్వాలని కోరారు.

ప్లాస్టిక్‌ను తరిమికొడదాం

మెదక్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడటం వలన వాటిలోని విషతూల్య రసాయనాలు వెలువడి క్యాన్సర్ లాంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనికోసం గ్రామప్రణాళికలో ప్రత్యుకంగా కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. ప్రజలు కూడా చైతన్యం కావాలన్నారు. ప్లాస్టిక్ భూమిలో కరిగిపోదని వందల సంవత్సరాలైన అలాగే ఉంటుందని అందుకే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి ప్రత్యమ్నాయాలను వాడాలని సూచించారు.

సీసీఎస్ ఎస్ఐ ఆత్మహత్య

– ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందిన సైదులు
– కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, జనవరి23(ఆర్ఎన్ఎ) : అంబర్‌పేట్ సీసీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సైదులు గౌడ్(45) ఆత్మహత్య చేసుకున్నాడు. అంబర్‌పేట పరిధి పటేల్ నగర్‌లోని ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు.

సెంట్రల్ క్రైం స్టేషన్‌లో పని చేస్తున్న ఆయన.. ఐదు నెలల సెలవుల అనంతరం తిరిగి విధుల్లో చేరారు. సూర్యాపేట జిల్లాకు చెందిన సైదులు 2007వ సంవత్సరంలో ఎస్సైగా విధుల్లో చేరాడు.

నగరంలోని మొగల్పురా పీఎస్‌తో పాటు ట్రాఫిక్ వింగ్‌లో ఎస్ఐ సైదులు 2017 వరకు విధులు నిర్వహించాడు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యాడు. సైదులు రెండు సంవత్సరాల నుంచి డిస్క్ సమస్యతో భాధపడుతున్నాడు.

దాంతో సిక్ లీవ్ తీసుకొని గత నెల నవంబర్‌లో తిరిగి విధుల్లో చేయడానికి రిపోర్ట్ చేయగా.. సైదులును సీపీఎస్‌కు బదిలీ చేశారు.

సైదులు సిక్ లీవ్‌లో ఉన్న సమయంలో ఆయన తోటి ఎస్ఐలు సీఐలుగా ప్రమోషన్ పొందారు.

తాను ఇంకా ఎస్ఐగానే ఉంటే, తన స్నేహితులు మాత్రం సీఐలు అయ్యారనే తీవ్ర భాదలో మానసిక క్షోభకు గురి అయ్యాడు. సోమవారం ఉదయం సైదులు భార్య నిర్మల పిల్లల్ని స్కూల్లో దించడానికి వెళ్ళినప్పుడు సైదులు ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంబర్‌పేట్ పోలీసులు సైదులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం : 9 మంది మృతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: దేశ రాజధాని ఢిల్లీలోని కైరారీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. మూడంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్ లో బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. మిగతా మూడంతస్తుల్లో ఇండ్లు ఉన్నాయి. అయితే రెండో అంతస్తులోని ఓ ఇంట్లో సిలిండర్ పేలింది. పేలుడు ధాటికి గోడ కూలిపోయింది. ఆ మంటలు గ్రౌండ్ ఫ్లోర్ లోని క్లాత్ గోడౌన్ కు వ్యాపించాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సుమారు 10 మంది గాయపడగా.. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది.

గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లే కీలకం

పల్లె ప్రణాళికతో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే

సంగారెడ్డి,డిసెంబర్23(నేటినిజం ప్రతినిధి): గ్రామాల్లో రోడ్లు, భవనాలు కడితే అభివృద్ధి కాదని గ్రామప్రజలు సర్పంచులకు సహకరించి పరిసరాల పరిశుభ్రత, సంపూర్ణ ఆరోగ్యంతోనే అసలైన అభివృద్ధి సాధ్య మవుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. గ్రామప్రణాళికలో సర్పంచ్‌లు కీలక భూమిక పోషించాలన్నారు. తెలంగాణ పల్లెల్లో పేరుకుపోయిన ఏండ్లనాటి కంపును పారదోలేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చి సమగ్రాభివృద్ధి, సంక్షేమం వైపు అడుగులు వేసేందుకు 30 రోజుల ప్రణాళికతో కార్యక్రమం చేపట్టారన్నారు.ట్రాక్టర్లతో గ్రామాలు పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చుకోవడంతో పాటు హరితహారం మొక్కలను కాపాడుకోవాలని సూచించారు.

గ్రామాల్లో ఆరుబయట చెత్తను పారవేయకుండా చెత్తబుట్టల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలన్నారు. గ్రామాల్లో డంప్‌యార్డులు నిర్మిస్తున్నారని రిక్షా వచ్చినప్పుడు రిక్షాలో చెత్తను వేయాలన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రతి ఆడబిడ్డ తల్లిదండ్రులకు బారం కావద్దనే సదుద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దీంతో 18 ఏండ్లు నిండిన ఆడబిడ్డలకు పెండ్లి సమయంలో రూ.లక్షా116 అందించేందుకు ప్రభత్వం అండగా ఉందన్నారు.

ఐదేళ్ల టీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

– కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్23(ఆర్ఎన్ఎ) : టీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఐదేళ్ల సమయంలో హైదరాబాద్ మహానగరంలో జరిగిన అభివృద్ధి శూన్యమని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు రేవంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జరగబోయే మూడు మున్సిపాల్టీలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన రేవంత్ రెడ్డి భౌరంపేటలోని జే.కే.గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి, కుసుమకుమార్, నందికంటి శ్రీధర్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఐదేళ్ల టీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమేనని విమర్శించారు. దీనిపై స్థానిక నాయకత్వంతో టీఆర్ఎస్ నేతలు చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. అభివృద్ధి సంగతి ఏమోగాని భూకబ్జాలు, అనుమతులులేని భవన నిర్మాణాలు కట్టుకోవడంతో టీఆర్ఎస్ నేతలు పోటీపడ్డారని ఆరోపించారు. ఐదేళ్లకు ముందు వరకు ఏమీలేని గులాబీ నేతలు, ఇప్పుడు కోటీశ్వరులుగా మారారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి టీఆర్ఎస్‌ను గెలిపిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, కనీసం ప్రజలు ఇప్పుడన్నా అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. జవహర్‌నగర్‌లో డంపింగ్ యార్డుకు స్వస్తిపలికే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డును ఒకవద్దే కాకుండా అక్కడక్కడ ఏర్పాటుచేసి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ ధీరతలో- పేదనొన్నదెప్పు
డ్డీలలో చెబలాందు సుబ్బిశెట్టికిరూపై
స్తుతి యించగ నటి యించగ
స్తుతి యించెద "అర్వాపల్లి సుబ్బారావున్"!!

(డిసెంబర్ 24 అర్వపల్లి సుబ్బారావు పుణ్యతిథి...)

-రాధశ్రీ
సెల్: 9494481210

రైతన్నలకు వందనాలు: మంత్రి జగదీష్ రెడ్డి

నల్గొండ, డిసెంబర్ 23:: ఇవాళ జాతీయ రైతుల దినోత్సవం. ఈ సందర్భంగా తెలంగాణ మంత్రివర్యులు జగదీష్ రెడ్డి రైతన్నలకు వందనాలు తెలిపారు. రక్తంతో నేలను దున్ని, స్వేదంతో సేద్యం చేసి.. తన బతుకును అన్నం మెతుకుగా మార్చే రైతన్నలకు వందనాలు అని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగాలం శ్రమించి, ఎండనకా, వాననకా.. తమ కష్టంతో యావత్ ప్రజానీకానికి అన్నం పెడుతున్న రైతన్నలకు ఎన్ని సార్లు కృతజ్ఞతలు తెలిపినా తక్కువ

ఇదంతా తెలివిలేనితనం కాదా?.!!

నేటినిజం
మంగళవారం 24-12-2019

జంతువులకు, పక్షులకు లేని గుణం మనుషులకు ఆ భగవంతుడు ప్రసాదించాడు. అవే ఏడవటం, నవ్వటం. వాటి ద్వారా మన బాధను, సంతోషాన్ని వ్యక్తీకరించుకోవచ్చు.

కానీ వాటి మనసులో ఏ భావం ఉందో కూడా తెలియక పాపం వాటంతట అవే కుమిలిపోతుంటాయి. మనిషికి బుద్ధి, జ్ఞానం అదనంగా సంపాదించుకుని జీవితాన్ని సక్రమమైన మార్గంలోకి కాకుండా వక్రమార్గంలో నడిపించుకొనడం దురదృష్టం. భగవంతుడిచ్చిన వరాలను దుర్వినియోగం చేస్తూ ఎక్కడైనా బెడిసికొడితే తిరిగి ఆ దేవుడినే తన కష్టాలు తీర్చమని మొరపెట్టుకుంటారు.

చేసిన తప్పులు మరచి తనను రక్షించమని ఆ దైవానికే ప్రార్థించుకుంటాం. మనిషికి ఎదురవుతున్న ఈతి బాధల్లో చాలావరకు స్వయంకృతాపరాధమే! తాను చేసిన పాపఫలితాలే! ఇదంతా కర్మఫలమనీ, పూర్వజన్మ సుకృతమని సరిపెట్టుకుంటూ లౌక్యంగా తన బాధల్ని, ఆవేదనల్ని మరొకరి ఖాతాలో పడేసి కాలం గడిపేస్తూ ఉంటారు. తనలో దాగిఉన్న శక్తి యుక్తుల్ని మరచిపోయి చేసిన దుష్కృత్యాలు పక్కన పడేసి పరిష్కారాలకోసం దైవం వెంటపడుతున్నారు. స్పందన కరవైందని నిరాశకు గురి అవుతుంటారు.

మనిషిని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన దేవుడే తన పాపాలకు మూలకారణమని గుడ్డిగా నమ్ముతున్నారు.

మనిషిని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన దేవుడే తన పాపాలకు మూలకారణమని గుడ్డిగా నమ్ముతున్నాడు.

పరిహారం కోసం పూజలు, వ్రతాలు ఉపవాసాల్లాంటివి చేస్తూ ఉపశమనం పొందుతున్నాడు. జీవిత కాలంలో ఏదో అద్భుతం జరుగుతుందని ఆశపడుతున్నాడు. ఇదంతా తెలివిలేనితనం కాదా?

మానవ జన్మ దుర్లభం అని తెలిసీ బుద్ధి, జ్ఞానాలను తగిన రీతిలో వినియోగించుకోలేక కష్టాల కడలిని ధైర్యంగా ఈదలేక నిత్యం ఎంతో నిరాశానిస్పృహలతో సతమతమవుతున్నాడు.

తీవ్రమయిన ఒత్తిడికి లోనవుతున్నాడు. ఆ ఒత్తిడికి కారణాలు అన్వేషించడం మానేసి మనశ్శాంతి ప్రసాదించమని దేవుడిని వేడుకుంటున్నాడు. తాను చేసిన తప్పులకు ఆ దేవునికి ఏమి సంబంధం? అవన్నీ దైవానికి చెప్పే చేసాడా? చేయాల్సిందంతా చేసి చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఆయనకు నివేదిస్తే ప్రయోజనం ఏమి ఉంటుంది? కర్మ చేసేందుకు ఇదెంతవరకు సమంజసమని దేవుడిచ్చిన బుద్ధిని ఉపయోగించాలి. జ్ఞానం ఉంది కాబట్టి ఉచితం అనుచితం తెలుసుకోవాలి. తప్పు చేయకుండా జాగ్రత్తలు వహించాలి. ఫలితం ఎలా ఉంటుంది అనేది ఊహించగలగాలి. అపుడింక దేవున్ని శరణువేడే అవసరం రాదు. ఏది మంచి, ఏది చెడు అని తెలుసుకునే ఇంగితజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఉంటుంది. స్వార్థంతో చాలా సార్లు చెడువైపే మనం ప్రయాణించే సంఘటలు ఎక్కువగా ఉంటాయి. అంతా సవ్యంగా సాగితే ఇదంతా మన తెలివి అని, లేకుంటే మన రోజులు బాగోలేవని దైవంపై నెట్టేస్తాం. అంతర్గత శక్తులపై అవగాహన పెంచుకుని అనునిత్యం అత్యంత జాగరూకతతో అడుగులు వేసిన మనిషికి అపజయం కలుగకుండా జీవన సాఫల్యం సిద్ధిస్తుంది.

సరస్వతీ విద్యాపీఠం పూర్వ విద్యార్థులు సమ్మేళనం

29న హైదరాబాద్ కార్యక్రమానికి రానున్న మోహన్ భగవత్

ఆదిలాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): ప్రాంత పూర్వ విద్యార్థి పరిషత్ శ్రీ సరస్వతి విద్యా పీఠం రాష్ట్ర స్థాయి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 29న హైదరాబాద్‌లోని శ్రీ శారదా ధామంలో నిర్వహించనున్నారు. దీనికి ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ హాజరవుతున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థిని సుహాసిని రెడ్డి వివరాలు తెలిపారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉద్యమ రూపం దాల్చి దేశ వ్యాప్తంగా 24 వేల విద్యాలయాలు విద్యాభారతి అఖిల భారతీయ శిక్ష సం స్థాన్ మార్గదర్శనంలో నిర్వహించబడు తున్నాయని అన్నారు. ఢిల్లీ కి అనుబంధంగా తెలుగు రాష్ట్రాల్లో 400 సరస్వతీ విద్యా పీఠాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. శిశు మందిరాల్లో విద్యాభ్యాసం చేసిన అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. ప్రాంత స్థాయిలో పూర్వ విద్యార్థుల సమేళనం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ నెల 29న పూర్వ విద్యార్థుల సమ్మేళనం హైదరాబాద్‌లోని శ్రీ శారదా ధామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 15 వేల మంది పూర్వ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఇది దేశంలోనే మొదటి కార్యక్రమని, 1500 మంది పూర్వ ఉపాధ్యాయులు కూడా హాజరయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంచాలక్ డాక్టర్ మోహన్ భగవత్ హాజరవుతారన్నారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల 26లోగా హౌసింగ్‌బోర్డు శిశుమందిర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

రైతులకు చేరువగా గ్రామీణ బ్యాంక్ రుణాలు

ఆదిలాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): ఇతర కార్పొరేట్ బ్యాంకులకు భిన్నంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు వివిధ రంగాల్లో అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జనరల్ మేనేజర్ సీహెచ్ నాగ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రామీణ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో బ్యాంకు అందించే వివిధ రకాల రుణాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ఇటీవల ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర కార్పొరేట్ బ్యాంకులకన్నా అన్ని స్కీముల్లో తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తోందని అన్నారు. తమ బ్యాంకులో జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. వ్యవసాయ రుణాలు పొందిన వారు ఏడాదిలోపు రెన్యూవల్ చేసుకుంటే పావలా వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని, ఏడాది దాటితే 7 శాతం వడ్డీ పడుతుందని అన్నారు. గృహ రుణాలతో పాటు పీఎంఏవై స్కీమ్ కింద రూ.2 లక్షల 70 వేల పరిమితి రాయితీని ఇస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిపాజిట్లలో 7.2 శాతం, సీనియర్ సిటిజన్స్‌కి 7.7 శాతం వడ్డీని అందిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాల్లో 68 బ్రాంచీల్లో రూ.3వేల కోట్ల ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు.

భూసమస్యలు లేకుండా చూడాలి

-క్షేత్రస్థాయి పర్యటనలతో చర్యలు తసుకోవాలి

జగిత్యాల,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా తాసిల్దార్లు కృషి చేయాలని కలెక్టర్ శరత్ సూచించారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పర్యటించి, ఏమైనా సమస్యలు దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. గ్రామాల వారీగా పరిష్కారం కాని భూ సమస్యలు, పరిష్కారం చూపిన భూ సమస్యలపై నివేదిక ఇవ్వాలన్నారు. తాసిల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పరిష్కారంకాని భూ సమస్యలను రైతుల సమక్షంలోనే చర్చించాలన్నారు. అలాగే అటవీ భూములను గుర్తించి, పరిష్కరించేందుకు రెవెన్యూ, అటవీశాఖ సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి తాసిల్దార్లు రైతుల వద్దకే వెళ్లి అక్కడి రైతుల నుంచి ఏమైనా ఫిర్యాదులు ఉంటే స్వీకరించి వాటిని, పరిష్కరించాలన్నారు. పరిష్కారమైనవీ, కానివి, ఏమైనా ఉంటే గ్రామాల వారీగా నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ఏ ఒక్క గ్రామంలోనూ భూ సమస్యలు ఉండొద్దన్నారు. అలాగే మండల పరిధిలోని అటవీ శాఖ భూములను కూడా గుర్తించి పరిష్కరించేందుకు రెవెన్యూ, అటవీశాఖలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అటవీ భూ ములను రీ కన్‌స్ట్రక్షన్ అటవీశాఖతో కలిసి పూర్తి చేయాలన్నారు. గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న వైకుంఠధామం, డంప్‌యార్డుల ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు అభ్యంతరాలు తెలుపుతున్నారనీ సర్పంచ్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కారానికి హామీ ఇచ్చారు.

రేపు కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం మూసివేత

భూపాలపల్లి,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): ఈనెల 25న కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయం మూసివేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. 26వ తేదీన కేతుగ్రస్త సూర్యగ్రహనం సందర్భంగా 25వ తేదీ రాత్రి 8 గంటల నుంచి ద్వార బంధనం చేసి తిరిగి 26వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఆలయం మూసి ఉంచనున్నట్లు వెల్లడించారు. తిరిగి సంప్రోక్షణ అనంతరం 26వ తేదీ సాయంత్రం 4 గంటల అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కలుగుతుంది. భక్తులు గమనించి ఆలయంకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

తిరుమలలో భక్తుల రద్దీ

తిరుమల,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి కొండపై సోమవారం భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి సర్వదర్శనం కోసం 26 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. ఉచిత దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. అలాగే శ్రీవారి టైం స్లాట్ సర్వదర్శనం, నడక, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. ఆదివారం శ్రీనివాసున్ని 85,869 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తిరుమల శ్రీనివాసుడి దర్శనానికి భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. శ్రీవేంకటేశ్వరుడి దర్శనానికి భక్తులతో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. వైకుంఠ వెలుపల కిలోమీటరు మేర భక్తులు బారులుతీరారు. 42,510 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం ఆదివారం రూ.3.07 కోట్లుగా ఉంది.

బిజెపి ఆత్మపరిశీలన చేసుకోవాలి

హైదరాబాద్, డిసెంబర్ 23:మొన్న మహారాష్ట్ర,హర్యానా ...ఇప్పుడు జార్ఖండ్ ...ఆయా రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చూస్తే బిజెపి ప్రభ మసక బారుతోందన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. హర్యానాలో చావుతప్పి కన్ను లొట్టపోయిన చందంగా మళ్లీ అధికారం చేజిక్కించుకున్నా, మహారాష్ట్రలో మాత్రం బొక్కబోర్లా పడ్డారు. అక్కడ కేవలం శివసేనకు అధికారం దక్కకుండా చేయడం ద్వారా అధికారాన్ని పంచుకునే అవకాశాన్ని దూరం చేసు కున్నారు. ఇకపోతే తాజాగా జార్ఖండ్ ఎన్నికల ఫలితాల సరళిని చూస్తుంటే అక్కడ అధికారం కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన బిజెపి... ఇప్పుడు అధికారాన్ని కాంగ్రెస్ కూటమికి అప్పగించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవల జరిగిన ఫలితాలను బట్టిచూస్తుంటే బిజెపి పట్ల ప్రజల్లో భ్రమలు తొలగిపోతున్నాయన్నది వాస్తవం. నేలవిడిచి సాము చేస్తున్న తీరు కనిపిస్తోంది. ప్రధానంగా జాతీయస్థాయిలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చరిత్రాత్మక నిర్ణయాలను తీసుకుని..ఇలాంటి పనులు బిజెపి మాత్రమే చేయగలదన్న నమ్మకం ప్రజల్లో కలిగించారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తల్లాక్, అయోధ్య సమస్యల పరిష్కారం, పౌరసత్వ చట్టం ఆమోదం వంటివి కాంగ్రెస్ హయాంలో సాధ్యం అయ్యే పనులు కాదు. కాంగ్రెస్ ఇంకో వందేళ్లు పాలించినా ఈ చారిత్రక నిర్ణయాలను సాధ్యం చేసే దమ్ము ఉండేది కాదు. కేవలం బిజెపి వల్ల మాత్రమే ఇవి సాధ్యం అయ్యాయి. అయితే ఇవి మాత్రమే ప్రజల అవసరాలు తీర్చగలవని భావించడం సరికాదు. ప్రధాని మోడీ, అమిత్ షాలు ఈ నిర్ణయాలతో ప్రజలను మెప్పించలేమని గ్రహించడం లేదు. ప్రజల కనీస అవసరాలు గుర్తించి నిర్ణయాలు జరగాలి. తీసుకున్న నిర్ణయాలతో ప్రజల్లో స్పందన రావాలి. ప్రస్తుత ఎన్నికల ఫలితాలను బేరీజు వేసుకుంటే సామాన్య ప్రజల తీరు అర్థం చేసుకోవచ్చు. చారిత్రాత్మక నిర్ణయాలతో దేశగతిని మార్చినా క్షేత్రస్థాయిలో వాటివల్ల ప్రజలకు కలిగే ఉపయోగం లేదు. ప్రభుత్వంగా చేపట్టే పనులు ప్రజలకు స్వాంతన కలిగించి, వారి బతుకుబండి నడిచే విధంగా ఉండాలి. ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహాన్ని బిజెపి నేతలు గ్రహించడం లేదు. ఆయా రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను తీసుకుంటే ప్రజాగ్రహం కానవస్తుంది. కేవలం 370 ఆర్టికల్ రద్దు, ట్రిబుల్ తలాక్ వంటి అంశాలను మాత్రమే ప్రజలు సానుకూలంగా చూడలేదని గమనించాలి. జిఎస్టీ,నోట్ల రద్దు తరవాత ఆర్థిక మందగమనం ప్రభావం సామాన్యులపై తీవ్రంగా ఉంది. నిరుద్యోగం పెచ్చు మీరుతోంది. ధరలు సవాల్ చేస్తున్నాయి. ఉల్లిపాయల ధర వందదాటింది. ధరల మోతతో సామాన్యులకు ఇక్కట్లు తప్పడం లేదు. పంటలు పండిస్తున్నా గిట్టుబాటు ధరలు దక్కక్క రైతులు ఆందోళన చెందు తున్నారు. ప్రజలు ధరలమోతతో ఆందోళన పడుతున్నారు. ఈ రెంటిమధ్య సారూపత్య కుదరడం లేదు.

అలాగే ఆర్థిక దివాళా కారణంగా ఇప్పుడు స్వయం ఉపాధి పథకాలు మూలన పడుతున్నాయి. సొంతంగా వ్యాపారం చేసుకునే పరిస్థితి లేదు. బ్యాంకుల తీరు సామాన్యులకు ఇక్కట్లు కలుగచేసేదిగా ఉంది. బ్యాంకులను దోచుకుని, రుణాలు ఎగవేసిన వారు దర్జాగా తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిలుగా, మంత్రులుగా చలామణి అవుతున్నారు. వీరిని ముక్కుపిండి రుణాలు వసూలు చేసివుంటే ప్రజలు ఆనందించేవారు. ప్రజల డబ్బుకు బ్యాంకుల్లో భరోసా లేకుండా పోయింది. ఈ సమస్యలను పక్కన పెట్టి బిజెపి కేవలం జాతీయవాదం, దేశవ్యాప్త ఎన్నార్సీ, 370 అధికరణ, సావార్కర్, శివాజీ ఇలా అనేకానేక అంశాలను ముందుకు తీసుకుని వచ్చింది. ఇవన్నీ కూడా మంచివే ...వీటిని ఎవరూ కాదనడం లేదు. అయితే ఇవి కూడా పెట్టయ్యన్న విషయం బిజెపి పాలకులు గమనించడం లేదు. అందుకే జార్ఖండ్‌లో ప్రజలు సంపూర్ణ మెజార్టీ ఇవ్వలేదు. తమలో గూడుకట్టుకున్న ఆగ్రహాన్ని ఓట్ల రూపంలో చెప్పారు. దీంతో ప్రజలు

ఈ ఎన్నికల్లో తమదైన శైలిలో ఓ హెచ్చరిక చేశారు. అందుకే స్థానికాంశాల జోలికి పోకుండా వీటిచుట్టూ అత్యధిక ఓట్లు నెగ్గుకురావాలన్న బీజేపీ వ్యూహం ఫలించలేదు. మరిన్ని రాష్ట్రాలను తన ఖాతాలో వేసుకోవాలని తహతహలాడుతున్న బీజేపీకీ ముందుముందు పరిస్థితి అంత ఈజీ కాదని గుర్తుంచు కోవాలి. ఒక్కో రాష్ట్రంలో అధికారం దక్కకుండా పోతుందని గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్‌ను ఎంతోకాలం విమర్శిస్తే కాలం గడవని గుర్తు చేసుకోవాలి. పై మెరుగులతో ప్రజలను ఎంతో కాలం మభ్య పెట్టలేమని గమనించాలి. అధికార బిజెపి పార్టీ ప్రచారం మహోద్ధృతంగా సాగినా, ఎన్నికల సభల్లో కాంగ్రెస్‌కు మోదీ సవాళ్ళు విసిరినా ప్రజల్లో మాత్రం బిజెపి పట్ల తీవ్ర అసంతృప్తి ఉందన్నది ఫలితాలను బట్టి వెల్లడయ్యిందని చెప్పాలి. బిజెపి ఇప్పుడు ఫలితాలతో సంబంధం లేకుండా దేశ ఆర్థిక స్థితిగతులపై సమీక్షించుకోవాల్సి ఉంది. ప్రచారం మొత్తంగా దేశభక్తి, జాతీయవాదం, కశ్మీర్ చుట్టూ నడిచినా ప్రజలు మాత్రం ఇవి తమకుముఖ్యం కాదన్న భావనలో ఉన్నారు. తినడానికి తిండి కావాలి. ఆకలి చల్లారాలి. ఆర్థికంగా కొట్టుకుపోతున్న వాడికి కథలుచెబితే పనిచేయవని ఎన్నికల ఫలితలను బట్టి తెలుసుకోవాలి. జార్ఖండ్‌లో మళ్లీ భారీ మెజారిటీతో తమకు అధికారం కట్టబెడతారన్న బీజేపీ నమ్మకాన్ని ఓటర్లు తిరస్కరించిన తీరుపై బిజెపి మేధోమథనం చేసుకోవాలి. ఒంటెత్తు పోకడలు కాకుండా దేశహితం కోరే పనులకు పూనుకోవాలి. ప్రజలు తమకు తాముగా బతకగలిగే ఆర్థిక విధానాలను అమలు చేయాలి. స్వయం ఉపాధి మార్గాలు పెంచుతూ,నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టాలి. ఆర్థిక పురోగమనానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. బ్యాంకులను బలోపేతం చేయాలి. ఓటర్లను అంత తేలిగ్గా తీసుకోకూడదన్న విషయాన్ని బిజెపి పెద్దలు గుర్తించి అతర్మథనం చేయాలి. దేశంలో క్షీణిస్తున్న పరిస్థితులపై చర్చించాలి. అలా చేయకుండా ఇతరత్రా గొప్ప నిర్ణయాలు తీసుకున్నా ఫలితం దక్కదని గుర్తుంచుకోవాలి.

తొలివిడత ప్రణాళికతో మారిన పరిస్థితులు

మలివిడత కోసం సిద్ధం అవుతున్న యంత్రాంగం

నిధుల విడుదలతో రూపుదిద్దుకుంటున్న పనులు

భద్రాద్రి కొత్తగూడెం,డిసెంబర్23(ఆర్ ఎన్ఎ): సీఎం కేసీఆర్ స్వయంగా రూపొందించి పకడ్బందీగా అమలు చేసిన పల్లె ప్రగతికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక జిల్లాలో సత్ఫలితాలను ఇచ్చింది. జిల్లా కలెక్టర్ రజత్ కుమార్ శైనీ నేతృత్వంలో జిల్లా అధికారులు నిరంతరం శ్రమించి కార్యాచరణ ప్రణాళికను పరుగులు పెట్టించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పల్‌ప్లలెలు కొత్త రూపును సంతరించుకున్నాయి. గ్రామాలలో శ్రమదానం చేస్తూ డంపింగ్ యార్డులకు, స్వర్గధామాలకు, ఇతరత్రా అవసరాలకు భూమిని విరాళాలు కూడా అందించారు. రెండవ విడుత ప్లలెకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో శ్మశాన వాటికల నిర్మాణం, డంపింగ్ యార్డుల ఏర్పాటు, ఇంకుడు గుంతల నిర్మాణం, నర్సరీల ఏర్పాటు ప్రధాన అంశాలుగా కొనసాగనుంది. మొదటి దఫా ప్రభుత్వం నిర్వహించిన పల్లె ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక జిల్లాలో పూర్తిస్థాయిలో విజయవంతమైంది. పల్లెప్రగతికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంతో జిల్లా వ్యాప్తంగా గ్రామాల స్వరూపం మారిపోయింది. ఈ కార్యాచరణ కార్యక్రమం తొలివిడత వర్షాకాలం కావడంతో తొలుత పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చిన జిల్లా కలెక్టర్ పల్లెల్లో పారిశుధ్యంను గాడిన పెట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్యంపై సమరభేరి మోగించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి గ్రామాలను సుందరవనాలుగా మార్చారు. న్నో ఏళ్ల కింద నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. అనేక గ్రామాల్లో శిథిల భవనాలు, పడావుబడ్డ బావులు, అస్తవ్యస్తంగా ఉన్న మురుగునీటికాల్వలు, ఎక్కడ చూసినా చెత్తచెదారంతో నిండిపోయిన గ్రామ ప్రధాన కూడళ్లు, బురదమయంగా మారిన అంతర్గత రహదారులు, చివరికి మనిషి చనిపోయిన అనంతరం అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కూడా సరిగా లేని శ్మశాన వాటికలు ఇది కొన్ని రోజులక్రితం వరకు ఉన్న పల్లెల ముఖచిత్రం. అయితే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో గ్రామాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. మొదటి విడత పల్లె ప్రణాళిక జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ నేతృత్వంలో గ్రామ, మండలాల ప్రత్యేకాధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రజలు ప్రతి పనిలో భాగస్వాములై తమ ప్లలెలను ప్రగతిపథంలో ముందుకుతీసుకెళ్లారు. పారిశుధ్య నిర్వహణ, హరితహారం కింద నాటిన మొక్కలకు నీరందించడం తదితర పనులకు ట్రాక్టర్లను పంచాయతీలకు పంపిణీ చేసారు. జిల్లా వ్యాప్తంగా కార్యాచరణ ప్రణాళిక పనులకు కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం నిధులు కేటాయించడంతో పనులు వేగవంతంగా జరిగాయి. ప్రతీ మొక్కకు నీరు పోసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడంతో జిల్లా కలెక్టర్ ప్రతీ శుక్రవారం వాటర్‌డేగా కేటాయిండంతో హరితహారం మొక్కలు జీవం పోసుకున్నాయి. అదే ఉత్సాహంతో రెండవ విడుత ప్లలెకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికకు ఉత్సాహంతో ముందుకు సాగనున్నారు. కొత్త సంవత్సరం ఆరంభమైన రెండవ రోజు నుంచే పల్లెకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ దిశగా జిల్లా అధికారులను కలెక్టర్ సమాయత్తం చేస్తున్నారు.జిల్లాలో 163 గ్రామ పంచాయతీలకు పందశాతం నిధులు కేటాయించి వారికి ట్రాక్టర్లను మంజూరు చేసారు. మరో 215 ట్రాక్టర్లు బ్యాంకు రుణాల ద్వారా మంజూరు చేయడంతో వాటిని కూడా గ్రామ పంచాయతీలకు ఇవ్వనున్నారు.

ఫసల్ బీమా అమలుకు సమాయత్తం

31 వరకు బీమా చెల్లించేందుకు గడువు

త్వరగా పేర్లునమోదు చేసుకోవాలని అధికారుల సూచన

హైదరాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రతీ ఏటా పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటలకు నష్టం జరిగితే రైతులకు పరిహారం అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమం త్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ, బీమా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, ఇత ర కారణాలతో పంటల నష్టానికి పరిహారం పొందేందుకు బీమా పథకంలో చేరేలా చైతన్యపరుస్తున్నారు.ఈ ఏడాది కూడా అమలు చేస్తూ అవసరమైన మార్గదర్శకాలను ఇటీవల విడుదల చేసింది. ఈ యాసంగిలో జిల్లాల్లోని 5 పంటలను ప్రభుత్వాలు నోటిఫై చేయగా, ఈ జాబితాను రాష్ట్ర వ్యవసాయ శాఖాధికారులు విడుదల చేశారు. జిల్లాలో సాగవుతున్న వరి, మొక్కజొన్న, పెసలు, వేరుశనగ, మిర్చి, మామిడి వంటి పంటలకు పథకాన్ని అమలు చేయనున్నారు. వీటిలో మొక్కజొన్న పంటకు ఈ నెల 15తో గడువు ముగియగా, వరి, జొన్న, మినుములు, పెసలు, వేరుశనగ, మిర్చి వంటి పంటలకు డిసెంబర్ 31తో ప్రీమియం చెల్లింపు గడువు ముగియనుంది. ఏ పంటకు ఎంత ప్రీమియం చెల్లించాలి..? వర్తించే బీమా ఎంత..? తదితర వివరాలను వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఎంపిక చేసిన పంటలకు రైతులు బీమా ప్రీమియం గడువులోగా చెల్లించాల్సి ఉంటుంది. బీమా కోసం ఎంపికైన పంటలకు రుణాలు తీసుకునే రైతులకు బ్యాంకులు నిర్బంధ ప్రాతిపదికన బీమా చేస్తాయి. రుణాలు పొందని, కౌలు రైతులు ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ పంటల బీమాను పొందవచ్చు. ఎంపికైన సూక్ష్మ బీమా సంస్థలతో లేదా ఆన్‌లైన్ ద్వారా బీమా చేసే రైతులు బీమా ప్రీమియం ద్వారా చెల్లించాలి. ప్రతిపాదన పత్రంతో పాటు పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం, పంట ధ్రువీకరణపత్రం ప్రతులను ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే బీమా కంపెనీ నుంచి పరిహారం మంజూరవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన నిర్ణీత గడువులోగా రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి. పంటల బీమా రైతుకే కాకుండా రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. ప్రతికూల పరిస్థితుల్లో పంటలకు నష్టం వాటిల్లితే అధికారులు వంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడులను అంచనా వేసి బీమా పథకం ద్వారా నష్టపరిహారం అందజేస్తారు. సాగు విస్తీర్ణాన్ని యూనిట్లుగా ఏర్పాటు చేసి పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తారు. వాటి ద్వారా ఆయా గ్రామాల్లో వచ్చిన పంట దిగుబడులను లెక్కిస్తారు. ఇలా వచ్చిన దిగుబడులు మూడేళ్లసగటు దిగుబడుల కన్న తక్కువగా ఉంటే దానికి అనుగుణంగా పరిహారం మంజూరవుతోంది. మండలంలో వాతావరణ పరిస్థితులను బట్టి పంటల దిగుబడులను అంచనా వేస్తారు.

యాసంగిలో రైతు కట్టాల్సిన ప్రీమియం 1.5 శాతం మాత్రమే. వార్షిక వాణిజ్య, ఉద్యానవన పంటలకు రైతు ఖరీఫ్, రబీలో 5 శాతం ప్రీమియం మాత్ర మే చెల్లించాలి. మొత్తం ప్రీమియంలో రైతు కట్టగా మిగిలిన ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయి. ఫసల్ బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనుంది. వేరుశనగ పంటకు గ్రామం యూనిట్‌గా వరి, మొక్కజొన్న మండలం యూనిట్‌గా వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే

జగిత్యాల,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): అన్నివర్గాల సంక్షేమమే సర్కారు లక్ష్యమని చొప్పందిడి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో ఆయన క్రిస్మస్ కిట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకులు క్రైస్తవులను ఓటు బ్యాంకుగానే చూశారని విమర్శించారు. అందుకు భిన్నంగా సీఎం కేసీఆర్ వారి అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. నిరుపేదలు అందరితో సమానంగా పండుగను జరుపుకోవాలనే సదుద్దేశంతో బట్టల పంపిణీ కార్యక్రమానికి సర్కారు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ ఫలాలు అందరికీ అంద

27 నుంచి ముక్కోటి ఏకాదశి

-పోస్టర్‌ను విడుదల చేసిన మంత్రి

భద్రాచలం,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని భద్రాచలం సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి జనవరి 16 వరకు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయ ఈవో, వేదపండితులు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని ఉత్సవాలకు ఆహ్వానించారు. మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం మంత్రి వైకుంఠ ఏకాదశి పోస్టర్లను ఆవిష్కరించారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... భద్రాద్రి ముక్కోటి ఉత్సవాల్లో స్వామివారు రోజుకో అవతారంలో దర్శనమిస్తారని తెలిపారు. జనవరి 5న తెప్పోత్సవం, 6న ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నర్సింహులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గన్నారు.

దొపిడీ దొంగలు బీభత్సం

నల్గొండ,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): మిర్యాలగూడలో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. ఆదివారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడ్డ దుండగులు దంపతులను బెదిరించి లూటీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి జరిగిన ఘటనతో స్థానికులు హడలెత్తిపోయారు. వివరాల్లోకి వెళ్లితే.. మిర్యాలగూడ మాజీ కౌన్సిలర్ ఎం. సందీపారెడ్డి ఇంట్లోకి చొరబడ్డ నలుగురు దొంగలు అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. గాఢనిద్రలో ఉన్న సందీపా భర్త నర్సిరెడ్డిని అతడి లుంగీతోనే కాళ్లు చేతులు కట్టేసి, ఇంట్లో వారిని బెదిరించి చోరీకి పాల్పడ్డారు. 30 తులాల బంగారు నగలు, రూ. 3 లక్షల నగదు దొచుకెళ్లినట్లుగా సందీపా భర్త పోలీసులకు తెలిపారు. ఏకంగా మాజీ ప్రజాప్రతినిధి ఇంట్లోనే భారీ దోపిడీ జరగడం పట్టణంలో సంచలనం రేపింది. ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని పలువురు వాపోతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మిర్యాలగూడ 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సమత కేసు విచారణ ప్రారంభం

ఆసిఫాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): అత్యాచారం, హత్యకు గురైన సమత కేసు విచారణ సోమవారం ప్రారంభమైంది. ఈ కేసు విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా ఏడుగురు సాక్షులు సోమవారం ఆదిలాబాద్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు హాజరు అయ్యారు. సెలవు దినాలు తప్ప ఈ నెల 31 వరకూ రోజుకు ఏడుగురు సాక్ష్యులను న్యాయస్థానం విచారణ చేయనుంది. సాక్ష్యుల స్టేట్‌మెంట్ రికార్డు అనంతరం, పోలీసులు సేకరించిన ఆధారాలు, ఎఫ్ఎస్ఎల్, డీఎన్ఏ నివేదికలు పరిశీలించిన తర్వాత జనవరి మొదటివారంలో తీర్పు వెలువడే అవకాశం ఉంది. కాగా గత నెల 24న దళిత మహిళపై సామూహికంగా అత్యాచారం చేసి హతమార్చిన సంగతి తెలిసిందే. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.

ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు షాక్

- కొత్త బార్ల పాలసీపై స్టే విదింపు
- యథాతథ స్థితిని కొనసాగించాలని ఉత్తర్వులు
- తదుపరి విచారణ ఆరువారాలకు వాయిదా

అమరావతి, డిసెంబర్23(ఆర్ఎన్ఎ) : ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు షాక్ ఇచ్చింది. కొత్త మద్యం పాలసీపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. పాలసీకి తాత్కాలిక బ్రేకులు వేసింది. కొత్త బార్లకు లాటరీ నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ పిటిషన్ తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. మద్యం పాలసీపై బార్ యజమానులు ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా సోమవారం హైకోర్టు పిటీషన్‌పై విచారణ జరిపింది. దీంతో ఏపీ ప్రభుత్వానికి షాక్‌నిస్తూ కొత్త బార్ల పాలసీపై స్టే విదించింది. గత నెలలో ఏపీ ప్రభుత్వం బార్ల లైసెన్సులు రద్దు చేసింది. కొత్త బార్ల విధానంలో భాగంగా ప్రస్తుతం ఉన్న బార్ల మూసివేతకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాలతో బార్లు మూతపడ్డాయి. అలాగే కొత్త బార్ పాలసీని ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 1నుంచి నూతన బార్ల విధానం అమల్లోకి తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యింది. ఆ పాలసీ ప్రకారం బార్ లైసెన్స్ దరఖాస్తు ఫీజును రూ.10 లక్షలుగా నిర్ణయించారు. ఆ డిపాజిట్ కూడా నాన్ రిఫండబుల్. 50వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో బార్ ఏర్పాటుకు రూ.25 లక్షలు, 5 లక్షల్లోపు జనాభా ఉన్న పట్టణాల్లో రూ.50 లక్షలు, 5 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాల్లో రూ.75 లక్షలు ఫీజుగా నిర్ణయించారు. బార్ షాపులను లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు.. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బార్లు నడుస్తాయి. రెండేళ్ల కాలపరిమితితో లైసెన్స్ జారీ చేస్తారు. దీంతో బార్ల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో దశలవారీగా మద్యాన్ని నిషేధిస్తామని చెబుతోంది ఏపీ ప్రభుత్వం. నూతన మద్య విధానంలో భాగంగా ఇప్పటికే వైన్ షాపుల్ని20 శాతం తగ్గించింది. అంతేకాకుండా ప్రభుత్వమే మద్యం విక్రయాలు నిర్వహిస్తోంది. అలాగే మద్యం ధరలను కూడా భారీగా పెంచేసింది. ఇప్పుడు బార్ల సంఖ్య తగ్గించేందుకు సిద్ధంకాగా.. ఏపీ హైకోర్టు తాత్కాలికంగా బ్రేకులు వేసింది.

అభివృద్ధిని అడ్డుకోవడమే విపక్షాల పని

- ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెం,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): అభివృద్ధిని అడ్డుకోవడమే ప్రతిపక్షాల పని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.252 కోట్లతో (ఎస్‌డీఎఫ్) జిల్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మరికొన్ని పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం హయంలో జిల్లాలో చేస్తున్న అభివృద్ధిపై చర్చకు గతంలో పత్రికల ద్వారా సవాల్ విసిరినప్పటికీ ప్రతిపక్ష నాయకులు చర్చకు రాలేదన్నారు. 2014 సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ , బీజేపీ నాయకుల మధ్య గొడవలు జరిగాయన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రజలను తప్పదోవపట్టిస్తున్నారు. టీఆర్ఎస్ పార్టీపై, నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని, దేశానికే ఆదర్శంగా మారిందని వనమా చెప్పారు.

పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలి: రాజగోపాల్ రెడ్డి

నల్గొండ,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): పత్తికొనుగొలును వేగవంతం చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మునుగోడులో సీపీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రు.ఈ సందర్భంగా ఆయన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాజగోపాల్‌రెడ్డి కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో లిక్కర్ ఏరులై పారుతుందని అన్నారు. మద్యం వల్లే నేరాలు జరుగుతున్నయని? రాత్రి ఎనిమిది గంటలకే వైన్ షాపులను మూసివేయాలని? ప్రభుత్వం బెల్టు షాపులను అరికట్టాలని చెప్పారు. మునుగోడు నియోజక వర్గ పరిధిలోని గ్రామాల్లోని వారంతా కలిసి కట్టుగా బెల్టు షాపులను మూసేస్తె? ఆయన తల్లి సుశీలమ్మ పేరున ఉన్న ఫౌండేషన్ ద్వారా ఐదు లక్షల నజరానా ఇస్తానని చెప్పారు.

రాష్ట్రపతికి గవర్నర్ విందు

హైదరాబాద్, డిసెంబర్23: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ శాఖకు సంబంధించిన మొబైల్ యాప్ ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. రాష్ట్రపతి ఆదివారం సాయంత్రం 7.45 గంటలకు రాజ్‌భవన్‌కు వచ్చారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనకు స్వాగతం పలికారు. పోర్టికో నుం చి సిట్టింగ్ రూం వరకు ఆయనను తీసుకువెళ్లారు. అక్కడ రాష్ట్రపతితో గవర్నర్ కొద్దిసేపు

మాట్లాడారు. ఈ సమయంలో ఆయన గవర్నర్ తమిళిసై టీ అందించారు. ఆ తర్వాత గవర్నర్‌తో కలిసి రాష్ట్రపతి రాజ్‌భవన్‌లోని వరండా వరకు వచ్చారు. జాతీయ గీతాలాపనలో పాల్గొన్నారు. ఆ తర్వాత రాజ్‌భవన్‌లోని లాన్స్‌లోకి వచ్చారు. అక్కడ రెడ్‌క్రాస్ సొసైటీ కోసం తయారు చేసిన మొబైల్ యాప్‌ను రాష్ట్రపతి ఆవిష్కరించారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచనల మేరకు తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ఈ మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఈ మొబైల్ యాప్ ద్వారా ఎవరైనా తమ పేరును రెడ్‌క్రాస్ సొసైటీలో మెంబర్‌గా నమోదు చేసుకోవచ్చు. ఈ విధంగా నమోదు చేసుకున్న ఒక పాఠశాల బాలికకు రాష్ట్రపతి ఈ సందర్భంగా సర్టిఫికెట్ అందజేశారు.

ఆ తర్వాత గవర్నర్ తమిళిసై రాష్ట్రపతి కోవింద్‌కు ప్రముఖులను పరిచయం చేశారు. రాత్రి 8 గంటల నుండి 8.30 గంటల వరకు విందు జరిగింది. రాష్ట్రపతి కోసం ప్రత్యేకంగా వంటకాలు చేశారు. తొలుత సూప్ అందించారు. భోజనంలో గ్రీన్ సలాడ్, మొలకెత్తిన విత్తనాలు, దక్షిణ భారత్‌లో ప్రఖ్యాతి గాంచిన పులిహోర, దోశ, రొట్టెలు, కొబ్బరి పచ్చడి, ఇడ్లీ, పుల్కా, తవ్వా పరాటా, నాన్‌రోటీ, పన్నీర్ మఖానీ, గోబీ ముసాలం, పప్పు, అన్నం, బిర్యానీ, దాల్ కిచిడీ, స్టీమ్డ్‌రైస్, పెరుగు, పంకాయ కొత్తిమీర కారం, బీన్స్ కూర, సాంబార్, రసంతో పాటు దబుల్ కా మీఠా, రసమలై, కేసరి బాదం తయారు చేశారు. చివరకు పళ్లు వడ్డించారు. విందు తర్వాత రాష్ట్రపతికి శాలువా కప్పి, మెమెంటో బహూకరించారు. 9.30 గంటలకు రాష్ట్రపతి కోవింద్ వెళ్లిపోయారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హిమాచల్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

జనవరి 1 నుంచి పల్లె ప్రగతి

పల్లె ప్రగతిపై ఆదివారం ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 23: పల్లె ప్రజల జీవితాల్లో నూతన అధ్యాయం ఆవిష్కరించేందుకు, గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగేందుకు ఉద్దేశించిన 'పల్లె ప్రగతి' కార్యక్రమాన్ని 2020 జనవరిలో పరిశీలిస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు తెలిపారు. పల్లె ప్రగతిపై ఆదివారం ఆయన ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, పల్లె ప్రగతి కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ స్క్వాడ్‌లు ప్రతి జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేస్తాయన్నారు. పల్లెప్రగతి కార్యక్రమాల పురోగతి, వాటి నాణ్యతను ఈ స్క్వాడ్‌లు పరిశీలిస్తాయన్నారు. పల్లెల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, 2019 సెప్టెంబర్ మొదటివారంలో పల్లెప్రగతిని చేపట్టామని ఆయ న గుర్తు చేశారు. ఈ కార్యక్రమం జనాదరణ విపరీతంగా పొందిందని, గ్రామీణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని ఆయన శ్లాఘించారు.

ప్రజలు చూపిస్తున్న ఉత్సాహాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు చూపించడం లేదని క్షేత్రస్థాయి నుండి తనకు సమాచారం అందిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. వంద శాతం ఫలితాలను రాబట్టేందుకు ఇప్పటికీ దిద్దుబాటుకు అవకాశం ఉందన్నారు. పల్లె ప్రగతి చేపట్టిన సమయంలోనే గ్రామాల్లో పనితీరుపై ఫ్లయింగ్ స్క్వాడ్‌ల చేత పరిశీలన చేయిస్తామని హెచ్చరించానని కేసీఆర్ గుర్తు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎక్కడైనా శ్రద్ధ చూపించలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఫ్లయింగ్ స్క్వాడ్‌ల పరిశీలనలో తేలితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేసీఆర్ హెచ్చరించారు.

పల్లెలను బాగు చేసుకోవడం కంటే మించిన పని ప్రభుత్వానికి లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉన్న విశ్వాసంతో పల్లెప్రగతి అమలు కోసం కావాల్సినంత సమయం ఇచ్చామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. పల్లె ప్రగతి తనిఖీ కార్యక్రమం ఎవరినీ ఇబ్బంది పెట్టేందుకు చేపట్టడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు గ్రామాల్లో తనిఖీలు చేసి ప్రభుత్వానికి నివేదికలు ఇస్తాయని ఆయన గుర్తు చేశారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ మూడు కేడర్ల నుండి ఉన్నతాధికారులను నియమించి తనిఖీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి అధికారికి రాండమ్ విధానంలో వివిధ జిల్లాల్లోని 12 మండలాల చొప్పున అప్పగిస్తామని,

ఈ మండలాల్లో వారు ఆకస్మిక తనిఖీలు చేస్తారన్నారు. ఎవరికి ఏ మండలాన్ని కేటాయిస్తామన్నది గోప్యంగా ఉంచుతామని, ఆకస్మికంగా నిర్వహించే తనిఖీల వల్ల పల్లె పురోగతి క్రాస్ చెక్ అవుతుందన్నారు. తద్వారా ప్రభుత్వానికి సరైన సూచనలు, సలహాలు అందుతాయన్నారు. తనిఖీల్లో తేలిన సమాచారం ప్రకారం వందశాతం పనిచేయని సర్పంచులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. అలసత్వం వహించే అధికారులను క్షమించే ప్రసక్తే లేదన్నారు.

పటిష్టం చేశాం

పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ, పటిష్టం చేశామని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. పంచాయతీరాజ్ శాఖలో పనిచేసే సిబ్బందికి వారి జీవితంలో ఊహించని విధంగా వదోన్నతులు కల్పించామని ఆయన గుర్తు చేశారు. గ్రామ కార్యదర్శుల నియామకం చేశామని, ఎంపీఓ, ఎంపీడీఓ, డీఎల్పీఓ, డీపీఓ, జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈఓ, సీఈఓల స్థాయి వరకు ఈ వ్యవస్థను పటిష్టపరిచామని తెలిపారు. గ్రామోద్యోగుల జీతాలు కూడా పెంచామని ఆయన గుర్తు చేశారు. వ్యవస్థ ప్రక్షాళన తర్వాత కూడా సరైన ఫలితాలు రాకపోతే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులదే బాధ్యత అవుతుందన్నారు.

పల్లె ప్రగతికి ప్రతి నెలా 339 కోట్ల రూపాయలు తంచనుగా ఇస్తున్నామని కేసీఆర్ తెలిపారు. పల్లెలను అభివృద్ధి వైపు నడిపించేందుకు జిల్లా కలెక్టర్లు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ చట్టంలో తెచ్చిన మార్పులతో కలెక్టర్లకు విస్తృతమైన అధికారాలను కట్టబెట్టామన్నారు. ఇన్ని చర్యలు తీసుకున్న తర్వాత కూడా సత్ఫలితాలు రాకపోతే అది కలెక్టర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులదే బాధ్యత అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో చర్యలు తీసుకున్న తర్వాత కూడా గ్రామాలు బాగుపడకపోతే ఇక జీవితంలో అవి బాగుపడవని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. అత్యవసర పనిమీద బెంగుళూర్ వెళ్లాల్సిన పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు ప్రయాణాన్ని వాయిదా వేయించి ఈ సమీక్షా సమావేశాన్ని అత్యవసరంగా నిర్వహిస్తున్నామంటే తన ఉద్దేశం, లక్ష్యాన్ని అందరూ అర్థం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, కార్యదర్శి స్మితా సబర్వాల్, సీఎం ప్రత్యేక కార్యదర్శి రాజశేఖరరెడ్డి, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు, మున్సిపల్ వ్యవహారాల ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, డైరెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎవరికీ అన్యాయం జరగదు

న్యూఢిల్లీ,డిసెంబర్ 23: కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పౌరసత్వ సవరణ చట్టం, ప్రతిపాదిత ఎన్నార్సీలు భారతీయ ముస్లింలకు ఎంతమాత్రం వ్యతిరేకం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఈ రెండింటి వల్ల దేశ ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నది ఎంతమాత్రం నిజం కాదని ఆదివారం ఇక్కడి రామ్‌లీలా మైదానంలో జరిగిన భారీ ర్యాలీలో స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు తనకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతూ చీలికలు తెస్తున్నాయని మోదీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఏఏ చట్టాన్ని సమర్థించుకున్న మోదీ 'ఇతర దేశాల్లో వేధింపులకు గురైన మైనారిటీలకు హక్కులు కల్పించడానికే ఈ చట్టాన్ని తెచ్చాం. అంతేకాని పౌరుల హక్కులను హరించడానికి కాదు' అని అన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు రగిలిస్తున్న కాంగ్రెస్, ఆప్, టీఎంసీ, వామపక్షాలపై మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మైనారిటీల పట్ల పాకిస్తాన్ ప్రభుత్వం అవలంబిస్తున్న వివక్షను ఎండగట్టేందుకు సీఏఏ ద్వారా భారత్‌కు ఓ మంచి అవకాశం లభించిందని, కానీ విపక్షాల రాజకీయాల కారణంగా ఇది చేజారి పోయిం దని మోదీ అన్నారు. దాదాపు వంద నిమిషాలపాటు మాట్లాడిన మోదీ పౌరసత్వ చట్టంపై ముస్లింల ఆందోళనలను తొలగించేందుకు గట్టిగా ప్రయత్నించారు. 'వివిధత్వంలోనే ఏకత్వం..అదే భారత ప్రత్యేకత' అన్న నినాదంతో మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ముస్లింలు తన ట్రాక్ రికార్డును పరిశీలించాలే తప్ప, ప్రతిపక్షాల టేప్‌రికార్డులను కాదని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దేశ ప్రజలందరి క్షేమం కోసం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని, పేదలకు ఎల్పీజీ సిలిండర్లు, ఆరోగ్య బీమా పథకాలను కల్పిస్తున్నామని చెప్పిన మోదీ 'ఈ పథకాల ప్రయోజనం ఆలయాలకు వెళ్తోందా? మసీదులకు వెళ్తోందా?' అన్న అంశాన్ని తామెప్పుడూ పట్టించుకోలేదని వివరించారు. సీఏఏ చట్టంగానీ, అలాగే ఎన్నార్సీగానీ ముస్లింలకు ఎంతమాత్రం ప్రతికూలం కాదని ఆయన మరోసారి ఉద్ఘాటించారు. వీటి విషయంలో ముస్లింలు ఎంతమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దీనిపై తప్పుడు ప్రచారం సాగిస్తూ అనవసరమైన అపోహలు రగిలిస్తున్నాయని మోదీ అన్నారు. ఈ చట్టం అమలైతే ముస్లింలను నిర్బంధ కేంద్రాలకు తరలిస్తారన్న వదంతులు కూడా గుప్పిస్తున్నారని మోదీ తెలిపారు. పైగా, సీఏఏ చట్టంతో భారతీయ పౌరులకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తేల్చిచెప్పారు. అలాగే, దేశవ్యాప్తంగా ఎన్నార్సీని తీసుకురావాల్సిన ఆలోచనను కూడా సమర్థించుకున్న మోదీ 'చొరబాటుదారులు ఎప్పుడూ తమ వాస్తవాలను బయటపెట్టరు. శరణార్థులు ఎప్పుడూ తమ గుర్తింపును దాచుకోలేరు' అని వ్యాఖ్యానించారు. తమ పాలనలో ఎవరి పట్ల అయినా వివక్ష కనబరిచానా అంటూ విపక్షాలకు ఈ సందర్భంగా ప్రధాని సవాల్ విసిరారు. ఓటుబ్యాంకు రాజకీయాలు, అబద్ధాలు, వదంతులతోనే దేశాన్ని చీల్చేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేకే ఈ రకమైన దుర్నీతికి పాల్పడుతున్నాయని ఆయన విరుచుకుపడ్డారు. నిజానికి ఎన్నార్సీని తెరపైకి తెచ్చింది గత కాంగ్రెస్ ప్రభుత్వాలేనని పేర్కొన్న ఆయన పార్లమెంటులోగానీ, కేబినెట్‌లోగానీ ఇంతవరకు దీనిపై తమ ప్రభుత్వం చర్చించలేదని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా ప్రజలను శాంతింపజేసే ప్రయత్నాలను విపక్షాలు చేయలేదని, పైగా పరోక్షంగా విధ్వంసానికి పత్తాను పలుకుతున్నాయని ఆయన అన్నారు. 'కావాలంటే నా దిష్టిబొమ్మను దగ్ధం చేయండి. దానిని చెప్పులతోనూ కొట్టండి. అంతేగాని ఇతరుల ఆస్తులను ధ్వంసం చేయవద్దు' అంటూ విపక్షాలను మోదీ అభ్యర్థించారు. దేశంలో తనకు వ్యతిరేకంగా ప్రచారాన్ని రేకెత్తించేం దుకు ప్రతిపక్ష పార్టీలు అన్నివిధాలుగా ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్న మోదీ, 'గత 20 ఏళ్లుగా తనను లక్ష్యంగా చేసుకుని విశ్వప్రయత్నమే చేశాయి. కానీ ఎక్కడా విజయం సాధించలేదు' అని అన్నారు.

మమతది కప్పదాటు

పౌరసత్వ చట్టం, ఎన్నార్సీలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కప్పదాటు చందంగా వ్యవహరిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే చొరబాటు దారులపై మమత తన వైఖరిని మార్చుకున్నారని ఢిల్లీ ర్యాలీలో మోదీ విరుచుకుపడ్డారు. బంగ్లాదేశ్ చొరబాట ుదారులను అడ్డుకోవాలని పార్లమెంటులో మమతా బెనర్జీ ఎన్నోసార్లు మాట్లాడారని, అలాగే బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాటుదార్లను అడ్డుకోవాలని కోరారని మోదీ గుర్తు చేశారు. కానీ, రాజకీయాల కారణంతో ఇప్పుడు ఆమె తన వైఖరినే మార్చుకున్నారని అంటూ మోదీ విమర్శించారు.

సంగారెడ్డిలో మంచినీటికి కటకట

సింగూరు జలాలు తరలించడంతోనే సమస్య
తక్షణం గోదావరి జలాలు తరలించాలి: జగ్గారెడ్డి

హైదరాబాద్,డిసెంబర్23(నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డిలో నీరులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సింగూర్ జలాలను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోవడం వల్ల సమస్య ఎక్కువైందన్నారు. హరీష్ రావు నీళు తరలించుకుపోతుంటే ఎంపీ ప్రభాకర్ రెడ్డి అడ్డుకోలేదన్నారు. ప్రజలు టీఆర్ఎస్‌కు ఓట్లు వేయడం వల్ల సంగారెడ్డిలో ప్రజలకు నీళ్ల సమస్య లేదు అనుకుంటున్నారు. ఓట్లు వేయడం వల్ల ప్రభుత్వానికి భయం లేకుండా పోయింది. ఎన్నికలప్పుడు మంత్రి వస్తారు గోదావరి నీళ్లు తెస్తానని చెప్పి వెళ్ళిపోతారని జగ్గారెడ్డి మండిపడ్డారు. 10 రోజుల్లో గోదావరి నీళ్లు ఇస్తారని ఆశిస్తున్నా.. కేసీఆర్, హరీష్ రావు, ప్రభాకర్ రెడ్డి నుంచి ఈ నెల 31లోపు గోదారినీళ్లు ఇస్తామని ప్రకటన రావాలన్నారు. లేదంటే జనవరి 2న నీళ్ల కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తా..నియోజకవర్గానికి నీళ్లు వచ్చే వరకు తమ నీళ్ల పోరాటం ఆగదన్నారు. జనవరి 2 తర్వాత తమ నియోజక వర్గానికి మంత్రి హరీష్ రావు, ఎంపీ ఎవరొచ్చినా నిలదీయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హరీష్ రావు ప్రజానాయకుడు కాదు ..కేసీఆర్ నీడలో ఎదిగిన వ్యక్తి . కేసీఆర్ ప్రోత్సాహంతోనే హరీష్ రావు షార్ట్ కట్ దారిలో మంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. మాకు నీళ్లు ఇవ్వకపోతే నియోజక వర్గంలో హరీశ్ రావు అడ్డుకుంటా ..నీళ్లు ఇస్తే సన్మానిస్తానని పేర్కొన్నారు.

రాజ్యాంగం నాశనం

హైదరాబాద్, డిసెంబర్ 23: పౌరసత్వ సవరణ చట్టం ద్వారా దేశాన్ని మతప్రాతిపదికన విభజించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం ప్రయత్నిస్తోందని, ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ ట్యాంక్‌బండ్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ జే గీతారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగాన్ని నాశనంచేసిందన్నారు. కాంగ్రెస్ ఏ ఒక్క వర్గానికి వ్యతిరేకం కాదన్నారు. ఆందోళనకారుల పట్ల పోలీసుల అనుచిత వైఖరి సరికాదన్నారు. యూనివర్శిటీలో పెద్ద మొత్తంలో పోలీసు బలగాల మోహరింపును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీన గాంధీ భవన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తామన్నారు. దీనికి పోలీసుల అనుమతి కోరినట్లు ఆయన చెప్పారు. పార్టీ సీనియర్ నాయకురాలు జే గీతారెడ్డి మాట్లాడుతూ లౌకిక శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. భారతదేశం లౌకికవాదానికి ప్రతీక అని అన్నారు. లౌకిక శక్తులను దెబ్బతీసేందుకు బీజేపీ చేస్తున్న కుయుక్తులను తిప్పికొడతామన్నారు. రాజ్యాంగ

ఛేజింగ్‌లో అదరగొట్టిన కోహ్లీ

విండీస్‌తో వన్డే సీరిస్ కైవసం
రికార్డులు సృష్టించిన కోహ్లీ, రోహిత్ శర్మ

కటక్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): కటక్ వన్డే క్రికెట్‌లో విజయంతో వన్డే సీరిస్‌ను భారత్ కైవసం చేసుకోవడంతో పాటు అనేక రికార్డులను కూడా సొంతం చేసుకుంది.

వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత్ నాలుగు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. దాంతో టీమిండియా 2-1తో సిరీస్ నెగ్గింది. వెస్టిండీస్ నిర్ణిత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 315 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ 48.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ కోహ్లి (81 బంతుల్లో 85; 9 ఫోర్లు), రాహుల్ (89 బంతుల్లో 77; 8 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ (63 బంతుల్లో 63; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. కోహ్లికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'... రోహిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' లభించాయి. కాగా, ఈ మ్యాచ్‌లో చిరస్మరణీయమైన గెలుపును అందుకుని సంవత్సరాన్ని ఘనంగా ముగించిన టీమిండియా పలు రికార్డులను ఖాతాలో వేసుకుంది.

అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంకా సచిన్ టెండూల్కర్ వన్డే సెంచరీల రికార్డుకు 6 శతకాల దూరంలో ఉన్నాడు. ఇప్పటివరకూ 43 వన్డే సెంచరీలను ఖాతాలో వేసుకున్న కోహ్లి.. ప్రత్యేకంగా ఛేజింగ్‌ల్లో తనదైన మార్కును చూపెడుతూ దూసుకుపోతున్నాడు. ప్రధానంగా 300 పరుగులు, అంతకంటే ఎక్కువ పరుగుల ఛేజింగ్ చేయాల్సిన వచ్చిన సందర్భాల్లో కోహ్లి ఇన్నింగ్స్ కసితో ఆడతాడు.. కసిదీరా కొడతాడు. ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డేలో కోహ్లి బ్యాట్‌తో చెలరేగిపోయాడు. వందకు పైగా స్ట్రైక్ రేట్‌తో 85 పరుగులు సాధించి జట్టు పరిస్థితిని గాడిలో పెట్టి విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా, టీమిండియా తరఫున ఆడుతూ 300 పరుగులకు పైగా ఛేజింగ్‌ను చేరుకోవాల్సిన తరుణంలో కోహ్లి ఇప్పటివరకూ 9 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. ఇక్కడ కోహ్లి స్ట్రయిక్ రేట్ 107.13 ఉండగా, యావరేజ్ 62.25గా ఉంది. 300 పరుగులకు పైగా ఛేజింగ్‌ల్లో కోహ్లి 31 ఇన్నింగ్స్‌లు ఆడి 1,743 పరుగులు సాధించాడు.

ఇందులో అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 183. 2012 ఆసియాకప్‌లో భాగంగా మిర్పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో పాక్ నిర్దేశించిన 330 పరుగుల టా÷-గ్గ÷ట్‌ను టీమిండియా సునాయాసంగా ఛేదించింది. ఈ మ్యాచ్‌లో కోహ్లి 148 బంతుల్లో 22 ఫోర్లు, 2 సిక్సర్లతో 183 పరుగులు సాధించాడు. వన్డేల్లో కోహ్లి ఓవరాల్ అత్యధిక వ్యక్తిగత స్కోరు కూడా ఇదే కావడం విశేషం. ఇకపోతే ఓ ఏడాదిలో ఓపెనర్‌గా అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా రోహిత్ శర్మ రికార్డు సృష్టించాడు. 22 ఏళ్లుగా శ్రీలంక ఓపెనర్ సనత్ జయసూర్య (1997లో 2387 పరుగులు) పేరిట ఉన్న ఈ రికార్డును రోహిత్ విండీస్‌పై మూడో మ్యాచ్‌లో అధిగమించాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది రోహిత్ మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కలిపి 2442 పరుగులు సాధించాడు. ఈ ఏడాది వన్డే ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా రోహిత్ నిలిచాడు. రోహిత్ ఈ ఏడాది 28 వన్డేలు ఆడి 1490 పరుగులు చేశాడు. ఇందులో 7 సెంచరీలు, 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి. కోహ్లి (1377), హోవ్ (విండీస్?1345) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు గెల్చుకున్న క్రికెటర్ల జాబితాలో విరాట్ కోహ్లి (57 సార్లు) ప్రస్తుతం జాక్వస్ కలిస్‌తో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాడు. సచిన్ (76 సార్లు), జయసూర్య (58 సార్లు) వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. వరుసగా నాలుగో ఏడాది విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లో (మూడు ఫార్మాట్‌లు) అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచాడు. కోహ్లి 2016లో 2595... 2017లో 2818... 2018లో 2735... 2019లో 2455 పరుగులు చేశాడు. వన్డేల్లో 300 అంతకంటే ఎక్కువ లక్ష్యాన్ని ఛేదించడం భారత్‌కిది 19వసారి. ఈ జాబితాలో ఇంగ్లండ్ (11 సార్లు), ఆ?రస్టేలియా (10 సార్లు), శ్రీలంక (10 సార్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ మ్యాచ్ ద్వారా పేస్ బౌలర్ నవదీప్ సైనీ భారత్ తరఫున వన్డేల్లో అరంగేట్రం చేసిన 229వ క్రికెటర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా ఈ సంవత్సరం భారత్ తరఫున ఐదుగురు ఆటగాళ్లు సిరాజ్, విజయ్ శంకర్, శుబ్‌మన్ గిల్, శివమ్ దూబే వన్డేల్లో అరంగేట్రం చేశారు.

? వెస్టిండీస్‌పై వరుసగా పదో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను భారత్ గెల్చుకుంది. ఓ ప్రత్యర్థిపై అత్యధిక వరుస సిరీస్ విజయాలు సాధించిన జట్టుగా టీమిండియా నిలిచింది. శ్రీలంకపై సాధించిన తొమ్మిది వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ (2005 నుంచి) సవరించింది.

తాగుబోతుల తెలంగాణ వద్దు

- మహిళలపై హత్యాచారాలకు మద్యమే కారణం
- దశలవారీగా మద్య నిషేదం అమలుచేయాలి
- బాలికల కిడ్నాప్ కేసులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్23 (ఆర్ ఎన్ఎ) : బంగారు తెలంగాణ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్.. రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం నాంపల్లి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట చాడ ధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణలో మద్యం అమ్మకాలను నియంత్రించాలని, బెల్ట్ షాపులను ఎత్తివేయాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ విలేకరులతో మాట్లాడుతూ.. 'తాగుబోతుల తెలంగాణ వద్దు.. బంగారు తెలంగాణ ముద్దు' అంటూ పిలుపునిచ్చారు. మహిళలపై హత్యాచారాలకు, సజీవదహనాలకు మద్యమే కారణమన్నారు. తెలంగాణలో బాలికల కిడ్నాప్ కేసులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2లక్షల బెల్ట్ షాపులుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు. మద్యం వల్ల మహిళలు, పేద కుటుంబాలు అన్యాయమవుతున్నాయన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చారని చాడ విమర్శించారు. ఏపీ ప్రభుత్వ మద్యం పాలసీని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మద్యం పాలసీపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. తెలంగాణ అంచెలంచులుగా మద్య నిషేధం వైపు అడుగులు వేయాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ రెండవ సారి అధికారంలోకి వచ్చినా ప్రజల సమస్యలను పట్టించు కోకుండా టీఆర్ఎస్ బలోపేతం కోసమే అధికారాన్ని వాడుకుంటున్నారని విమర్శిం చారు. రాష్ట్రం లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కానీ కేసీఆర్‌కు మాత్రం అవేమీ పట్టకపోవటం దారుణమ న్నారు. కేసీఆర్ వెంటనే తన తీరును మా ర్చుకొని ప్రజా సంక్షేమంకోసం పాటుపడా లని, మద్యాన్ని దశలవారీగా నియంత్రిం చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

అనంతపురం,డిసెంబర్23(ఆర్ఎన్ఎ) : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు, బకాయిలు, మెస్ కాస్మొటిక్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ దక్షిణ ప్రాంత జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా హిందూపురం పట్టణంలో ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వేలాదిగా విద్యార్థులు పాల్గని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ.. విద్యార్థులను మోసం చేస్తున్న ఎపి సర్కారుపై మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 4 వేల కోట్ల రూపాయలు పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు, మెస్, కాస్మొటిక్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ప్రతి ఒక్క విద్యార్థికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా తమ ప్రభుత్వమే చదివిస్తుందని హామీ ఇచ్చి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే పూర్తిగా విద్యారంగాన్ని గాలికి వదిలేసి ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని మినహాయించి మిగతా అన్ని రంగాలలో తమకు అవసరం అనుకున్న వారికి ప్రభుత్వ పథకాలను అందజేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఇప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు, మెస్, కాస్మొటిక్ బిల్లులను విడుదల చేయకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఈ విధంగా నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థుల ముక్కు పిండి మరీ ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన చెందారు. మెస్, కాస్మొటిక్ బిల్లులు నేటికీ విడుదల కాకపోవడం వల్ల హాస్టల్ వా÷-డ్గ÷న్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థులకు అందవల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు, మెస్ కాస్మొటిక్ బిల్లులను విడుదల చేయాలని బాబావలి డిమాండ్ చేశారు లేని పక్షంలో విద్యార్థులను ఏకతాటిపైకి తెచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తక్షణమే స్పందించి విద్యార్థులకు అందవల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు, మెస్ కాస్మొటిక్ బిల్లులను విడుదల చేయాలని బాబావలి డిమాండ్ చేశారు లేని పక్షంలో విద్యార్థులను ఏకతాటిపైకి తెచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ

సున్నపురాళ్లపల్లెలో స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసిన సీఎం

మూడేళ్లలో ఉక్కు కర్మాగారాన్ని పూర్తి చేస్తాం

- నా జీవితంలో ఇది మరిచిపోనిరోజు
- స్టీల్ ప్లాంట్‌తో 25వేల మందికి ఉద్యోగ అవకాశాలు
- ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

కడప, డిసెంబర్23(ఆర్ఎన్ఎ) : కడప జిల్లాలో ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేయడం తన జీవితంలో మరచిపోలేని రోజని, ఉక్కు కర్మాగారాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో కడప ఉక్కు కర్మాగారానికి సీఎం వైఎన్ జగన్ శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ.. జిల్లాకు స్టీల్ ప్లాంటు రావాలని, అభివృద్ధి బాటలో పరుగులు పెట్టాలని చాలా ఏళ్లుగా అనుకున్నానని, నాన్న హయాంలో జిల్లా అబివృద్ధికి బీజాలు పడ్డాయని అన్నారు. కానీ ఆయన చనిపోయిన తరువాత జిల్లా అభివృద్ధిని పట్టించుకునేవారే లేకుండా పోయారని జగన్ అన్నారు. సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు ఒక పెద్ద మనిషి వచ్చి టెంకాయ కొట్టాడని, ఐదేళ్లు పాలించడానికి ప్రజలు అధికారమిస్తే, నాలుగేళ్లు ఏమి చేయకుండా ఎన్నికలకు ఆరు నెలల ముందు టెంకాయ కొడితే మోసం అంటారన్నారు. అదే అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే టెంకాయ కొడితే చిత్తశుద్ధి అంటారని జగన్ అన్నారు. పాలనలో తేడాను ప్రజలు గమనించాలని జగన్ సూచించారు.

ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా 25వేల మందికి ఉద్యోగాలు వచ్చే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. అక్షరాల రూ. 15 వేలకోట్ల రూపాయలతో పునాదిరాయి వేశామని, స్టీల్ ప్లాంట్‌కు కావాల్సిన ఐరన్ ఓర్ కోసం ఎన్ఎండీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, జిల్లా వాసుల బతుకులు మారిపోతాయని జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కడప ఉక్కు కర్మాగారాన్ని మూడేళ్లల్లో నిర్మిస్తామని ఎపి ముఖ్యమంత్రి వైఎన్ సగన్మోహన్ రెడ్డి అన్నారు. పారిశ్రామిక రంగంలో కడప జిల్లా పరుగులు పెట్టాలని కలలు కన్నానని చెప్పారు. వైఎన్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత కడప జిల్లాను పట్టించుకునే వారు కరవయ్యారన్నారు. గతంలో ఎన్నికలకు కేవలం 6 నెలల ముందు టెంకాయ కొట్టి మోసం చేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో చేస్తే దానిని చిత్తశుద్ధి అంటారని పేర్కొన్నారు.

'రాయలసీమకు మంచి జరగాలంటే నీళ్లు, పరిశ్రమలు, ఉద్యోగాలు రావాలి. కడప ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉంది. మూడేళ్లలో ఈ పరిశ్రమ పూర్తి చేస్తాం. రూ.15 వేల కోట్లతో ఉక్కు పరిశ్రమకు పునాది రాయి వేసుకున్నాం. ఈ పరిశ్రమ ఇక్కడి రావడానికి ఎన్ఎండీసీతో ముందడుగు వేశాం. రాష్ట్రం విడిపోయాక 5 ఏళ్లపాటు చూశాం.. ఎవ్వరూ పట్టించుకోలేదు' అని సీఎం అన్నారు. కడపకు న్యాయం జరిగే రోజులు మళ్లీ వచ్చాయని ఈ సందర్భంగా జగన్ వ్యాఖ్యానించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు.

రాష్ట్రంలో ఏ విధంగా అభివృద్ధి జరుగుతుందనేది పేపర్‌లో కాదని, స్వయంగా ప్రజల మధ్యకు వెళ్ళి చూసి ప్రభుత్వానికి మద్దతు పలకాలని ప్రతిపక్షాలకు సూచించారు. ప్రతిపక్ష నేతల పిల్లలు మాత్రం ఇంగ్లీష్ మీడియంలో చదవొచ్చు... కానీ పేదోళ్ల పిల్లల మాత్రం ఇంగ్లీష్ పాఠశాలలో చదవకూడదా అని మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా సీఎం నెరవేర్చుతున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఏడాదికి 3 మిలియన్ మెట్రిక్ టన్నుల ఐరన్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అన్ని జిల్లాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారని మంత్రి ఆదిమూలపు పేర్కొన్నారు.

వైఎస్సార్ జిల్లా వాసుల కల నేటితో నెరవేరిందని ఎంపీ అవినాష్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక హోదాతో పాటు స్టీల్ ప్లాంట్ ఇస్తామని మోసం చేశారని.. గత ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని మండిపడ్డారు. సీఎం వైఎన్ జగన్ స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనకు ముందే ముడిసరుకు కేటాయించారన్నారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా 25 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.ప్రతిపక్ష నేత చంద్రబాబువి ఉత్తుత్తి దీక్షలేనని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు. మాట ఇస్తే మడం తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి వైఎన్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే నాలుగు లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే స్టీల్‌ప్లాంట్‌కు ముఖ్యమంత్రి వైఎన్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అన్నారు. మూడేళ్లలో స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి 25 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. పాదయాత్రలో సీఎం జగన్ మాట ఇచ్చిన ప్రకారమే ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారని తెలిపారు. వైఎస్సార్ జిల్లా వాసుల కల నేడు నెరవేరిందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీ అవినాశ్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఆహా!! అక్షయ పాత్ర..!!

సంగారెడ్డి డిసెంబర్ 23(నేటినిజం ప్రతినిధి) అక్షయ పాత్ర అందిస్తున్న సేవలు అద్భుతమని రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్ కూరగాయలు అందించవచ్చని, ఆ దిశగా ప్రణాళిక రూపొందించవలసినదిగా -మంత్రి సత్యవతి రాథోడ్.!!

కొనియాడారు. పిల్లలకు ఆరోగ్యకరమైన, రుచికరమైన, పౌష్టికమైన ఆహారాన్ని అత్యంత శుభ్రతతో అందించడం ముదాహమని అన్నారు. శనివారం కంది లోని అక్షయపాత్ర ఫౌండేషన్ ను సందర్శించి రైస్ క్లీనింగ్ మెషిన్ ను ప్రారంభించారు. ఆ తరువాత ఫుడ్ ప్రాసెసింగ్ కు సంబంధించి కూరయాగాల తరుగు యంత్రాలు, వంట శాలను పరిశీలించి ఇంత అత్యద్భుతంగా పరిశుభ్రతను పాటించడం చూసి ఆక్షర్యనీ వ్యక్తం చేశారు. కందిలో అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రారంభించి కేవలం ఒకటిన్నర సంవత్సరమే అయినా అత్యంత ఆధునికమైన వంటశాల ఏర్పాటు చేసి పరిశుభ్రమైన ఆహారాన్ని కేవలం నాలుగు గంటల వ్యవధిలో జిల్లాలోని ఒక లక్ష 25 వేల మంది విద్యార్థులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికమైన ఆహారాన్ని అందించడం గొప్ప విషయమని అన్నారు.

ఫౌండేషన్ వారు విద్యార్థులకు భోజనం అందించే విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని గమనించామని మంత్రి చెప్పారు. నాణ్యమైన ప్రమాణాలతో రుచికరమైన భోజనం శుభ్రతతో చేసి అందించడం ఆషామాషీ కాదని అన్నారు. కాగా జిల్లాలోని 700 ప్రభుత్వ పాఠశాలలో మధ్యాన్నం భోజనముతో పాటు, సదాశివపేట, జహీరాబాద్, పటాన్చెరు ప్రాంతాలలోని 875 అంగన్వాడీ కేంద్రాలలో గల పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు భోజనం మధ్యాన్నం ఒంటిగంట లోగ అందించుటలో ఉదయమే వంటి చేసి పంపడం వలన పదార్థాలు చల్లగా అవుతున్నాయని అన్నారు. 25 నుండి 30 వేల మంది వరకు వంట వండించి విధంగా ఎక్కువ కేంద్రాలు నెలకొల్పితే వేడి వేడి భోజనం, పప్పు, చారు, ఫౌండేషన్ నిర్వాహకులు విగ్నేశ్వర స్వామికి సూచించారు. చిన్న పిల్లలలో ఎదుగుదల ఉంటుందని వారికి సరైన పౌష్టికాహారం ఆ సమాయంతో ఇస్తేనే పెరుగుదల సాధ్యమవుతుందని అన్నారు.వరంగల్, మహబూబ్ నగర్ ప్రాంతాలలో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది, అక్కడి పరిస్థిలను అధ్యయనం చేసి ఇక్కడ ఇంకా మెరుగ్గా ఏమి చేయాలో పరిశీలించాలని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్ కు , మహిళా శిశు సంక్షేమ శాఖా ప్రిన్సిపాల్ సెక్రటరీ జగదీశ్వర్ కు మంత్రి సూచించారు. ఒక సారి జిల్లా కలెక్టర్ తో సమావేశమై తక్కువ మంది పిల్లలకు వేడివేడిగా భోజనం అందించే విధంగా ఎక్కువ కేంద్రాలు నెలకొల్పే విధంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అన్నారు. రాష్ట్రంలో గిరి పోషణ ద్వారా భోజనంతో పాటు పౌష్టికాహారంగా గుడ్డు, పాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్ మాట్లాడుతూ గ్రౌండింగ్ లో ఉన్న పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయి తెలుసుకొని, ఏమైనా లోటుపాట్లు ఉంటె సరిచేయడానికి ఈ పర్యటన ఉద్దేశమని అన్నారు. ఇక్కడ అక్షయ పాత్ర ద్వారా విద్యార్థులకు భ్నోజనం అందిస్తున్న మాదిరే రాష్ట్రంలోని అన్ని లీపాఠశాలలలో అందించే ఆలోచన ఉన్నాడని అన్నారు. అంగన్వాడీ విద్యార్థులకు భోజనం పెట్టడంలో దేశంలోనే మన రాష్ట్రం ముందుందన్నారు

ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖా ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీశ్వర్, జిల్లా కలెక్టర్ యం .హనుమంత రావు, ఆర్.డి.ఓ. శ్రీను, జిల్లా సంక్షేమ అధికారి పద్మావతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొజంజాహి మార్కెట్..
అధునీకరణ పనులు వేగవంతం చేయండి

- సైన్‌బోర్డులు, షాప్‌ల నెంబరింగ్ ఒకేలా ఉండాలి
- మార్కెట్ బయటి వైపు రాతి నిర్మాణం ఉండాలి
- మున్సిపల్‌శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్

హైదరాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): చారిత్రక నిర్మాణమైన మొజంజాహి మార్కెట్ ఆధునీకరణపనులు వేగవంతం చేయాలని మున్సిపల్‌శాఖ కార్యదర్శి అర్వింద్‌కుమాం అధికారులను ఆదేశించారు. వారసత్వ సంపదగా ఈ నిర్మాణాన్ని రక్షించుకునేందుకు ప్రభుత్వం ఆధునీకరణకు శ్రీకారం చుట్టింది. ఈనేపథ్యంలో అర్వింద్‌కుమార్ జీహెచ్ ఎంసి జోసల్‌కమిషనర్ ముషారఫ్‌తో కలిసి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశ ఆధునీకరణపనులు నిర్ణీతసమయంలో పూర్తిచేయాలని అన్నారు. ఇప్పటికే ఈ పనులు పూర్తికావచ్చాయని అధికారులు వివరించారు. ఈసందర్భంగా అర్వింద కుమార్ మార్కెట్ చుట్టూతిరిగి పనులను పరిశీలించారు. మార్కెట్ కారిడార్‌లో ఫుల్‌పాత్‌ల నిర్మాణం అంతా ఒకే తర హాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌లోపలికి తీసుకు వచ్చిన లైమ్‌మోర్టార్ (సున్నపు యంత్రం) యూనిట్‌ను అక్కడి నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం కారిడార్‌లో ప్లోరింగ్‌పనులు పూర్తిచేయాలన్నారు. అవసరమైన తొందరగా స్ట్రీట్‌ఫర్నిచర్, లైటింగ్ పనులుపూర్తిచేయాలని అన్నారు. మొత్తం మార్కెట్ పరిసరాల్లో తాగునీరు,డ్రైనేజీ పనులుపూర్తిచేసినట్టు వాటర్‌బోర్డు అధికారులు తెలిపారు. మార్కెట్‌లోని అన్ని చోట్లా సైన్‌బోర్డులు, షాప్‌ల నెంబరింగ్ ఒకే విధంగా ఉండేలా చూడాలని అర్వింద్‌కుమార్‌ఆదేశించారు. మొజంజాహి మార్కెట్ రూపురేఖలు మారకుండా మార్కెట్ బయటి వైపు రాతి నిర్మాణం ఉండాలని అన్నారు ఈ మార్కెట్‌లో మోడర న్ మటన్‌మార్కెట్ నిర్మాణం వెటర్నరీ అధికారుల సూచనలతో నిర్మించాలన్నారు. అలాగే ఇందులో రిఫ్రిజిరేటర్, బ్లోఎయిర్ వంటి సదుపాయాలను క ల్పించాలని ఆదేశించారు. ఇదిలావుంటే జంటనగరాల్లో కొన్నిరోజుల క్రితం మెట్రో స్టేషన్‌ల నిర్మాణంలో భాగంగా తొలగించిన బస్‌షెల్టర్ల స్థానంలో కొత్త వాటిని నిర్మిస్తామని జీహెచ్ఎంసి కమిషనర్ లోకేశ్‌కుమార్‌తెలిపారు. మెట్రోపిల్లర్ల నిర్మాణం కోసం దాదాపు 400 బస్‌షెల్టర్లు తొలగించారు. తాజాగా ప్రయాణీకుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో ఆధునికడిజైన్లతో 800 బస్‌షెల్టర్లను నిర్మిస్తామన్నారు. నగరంలోని హోటల్ టూరిజం ప్లాజాలో జరుగుతున్న నగర సమన్వయ సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ప్రధాన రోడ్లపై రద్దీని తగ్గించేందుకు లింక్‌రోడ్లను సమాంతర రోడ్లుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మెట్రో పిల్లర్ల కింద ఏవిధమైన అపరిశుభ్రత లేకుండా క్లీన్ చేయాలని, తద్వారా ప్రయాణీకుల రాకపోకలకు ఏవిదమైన ఆటంకం ఉండకుండా చూడాలని అన్నారు.

ఆరోగ్యశాఖను తీర్చిదిద్దుతున్నాం

నేచర్ క్యూర్ ఆస్పత్రిలో ఫర్టిలిటీ సెంటర్
మంత్రి ఈటెల రాజేందర్ వెల్లడి

హైదరాబాద్,డిసెంబర్23(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఏర్పడ్డాక వైద్య ఆరోగ్యశాఖను గొప్పగా తీర్చిదిద్దు తున్నామని మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. భారతీయ సంప్రదాయ వైద్యానికి పూర్వ వైభవం తీసుకురావడానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర యోగాధ్యయన పరిషత్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావే